Pubilshed from Visakapatnam

PRGI NO : APTEL/25/1888

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



విశాఖపట్నం VISAKAPATNAM | సంపుటి : 01 | సంచిక : 303 | గురువారం | నవంబర్ 5, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 01 | Issue No : 303 | Thursday | 5 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్‌లో ఈడి సోదాలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్ లో ఈడి సోదాలు చేపట్టింది. మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు పలువురు ఇళ్లల్లో ఈడి సోదాలు నిర్వహిస్తుంది. తెలంగాణ, ఏపీలలో ఏడు చోట్ల ఏకకాలంలో ఈడి సోదాలు నిర్వహించింది. మెయిన్ మూల్యాంకరంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటు న్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణల నేపథ్యంలో ఈడీ సోదాలు నిర్వహించింది.

- మిగతా 2లో..

కరువు నుంచి రైతన్న గట్టెక్కేలా ఆదుకోండి

వ్యవసాయరంగానికి మద్దతుగా వీబీ జీ రామ్ జీ పథకం

» డ్రాట్ కార్డుల జారీకి, జేజేఎం విస్తరణకు సహకరించాలి » పంటల బీమా పరిహారం త్వరగా అందేలా చర్యలు » కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేలా కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) బుధవారం ముఖ్యమంత్రిని కలిసింది. ఈనెల 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన సభ్యులు తమ కరువు అధ్యయన వివరాలు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని తీర ప్రాంతం తుఫాన్ల సమస్యతో ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో కారణంగా రాయలసీమ సహా ఇంకొన్ని ప్రాంతాలు తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆ బృందానికి వివరించారు. రాష్ట్రం లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలు, రైతుల సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలపై స్పష్టత లభించిందని వెల్లడించారు.

రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే గణనీయంగా తక్కువ వర్షపాతం నమోదైందని, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఐఎంసీటీ సభ్యులకు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసం సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. అనంతపురం జిల్లాలో దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన పరిస్థితిని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 21 జిల్లాల్లో 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్ర సాయం కోరుతూ ఇప్పటికే మెమొరాండం సమర్పించామన్నారు. వారం రోజుల్లో కరువు పరిస్థితులపై కేంద్రానికి నివేదిక కూడా సమర్పిస్తామనిసీఎం చెప్పారు.

2 పేజీలో..



"భగినీ హస్తభోజనం వేళ గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్న శ్రీ కనకదుర్గమ్మవారు"

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారు కార్తీక శుద్ధ విదియ (భగినీ హస్తభోజనం -భ్రాతృవిదియ) పురస్కరించుకుని నవంబర్ 11న విశేషంగా గాజుల అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. శ్రీ అమ్మవారికి కుంకుమ, గాజులు అత్యంత ప్రీతిపాత్రమైనవి కావడంతో దేవస్థాన ఆనవాయితీ ప్రకారం ఈ దివ్య అలంకారాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.ఈ విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ అమ్మవారి దివ్యాలంకరణ నిమిత్తం విజయవాడకు చెందిన గ్రంధి రాము, రాధిక దంపతులు మరియు 'శ్రీ కనకదుర్గ లలితా పారాయణ బృందం' తరపున 446 తోడాల గాజులను దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ కు అందజేశారు.

- మిగతా 2లో..



ప్రజాభూమి ప్రతినిధి, అమ రావతి:

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం హెచ్చరిస్తున్నది. రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో భారతీయ యువతను మోసం చేసి, ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరికను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడమైనది.

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల

అప్రమత్తంగా ఉండాలి

ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతను కొన్ని ప్రైవేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అక్రమ ఏజెంట్లు ఇతర ఉద్యోగాలు, అధిక వేతనాలు, మెరుగైన ఉపాధి అవకాశాల పేరుతో విదేశాలకు పంపిస్తున్నట్లు సమాచారం అందుతోంది.విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి, యువతను రష్యాకు పంపిన అనంతరం వారిపై ఒత్తిడి తెచ్చి సైన్యంలో చేరేలా చేస్తున్నట్లు, అధిక వేతనాల ఆశ చూపుతున్నట్లు లేదా తప్పుడు కేసుల్లో ఇరికించి బలవంతంగా సైనిక

2 లో



సిఎం చంద్రబాబుకు ప్రధాని మోడి ఫోన్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఎపిలో వరుసగా ఏర్పడిన అర్నబ్, మురసు తుపాన్ల ప్రభావంపై ఎపి సిఎం చంద్రబాబుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి బుధవారం ఫోన్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం లో తుపాన్ల వల్ల జరిగిన నష్టాన్ని ప్రధానికి ముఖ్యమంత్రి వివరించారు.

2 పేజీలో..



నేడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

ఏపీఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈఓ

2 లో

రహదారుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

» 162.841 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులు.. 201 చెట్ల తొలగింపు పూర్తి » రహదారుల మరమ్మతులకు రూ.143.36 కోట్ల అవసరమని ప్రాథమిక అంచనా » రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా రహదారులపై పడిపోయిన చెట్ల తొలగింపు, ట్రాఫిక్ పునరుద్ధరణ, దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులకు సంబంధించి మొత్తం 162.841 కిలోమీటర్ల మేర రహదారి ఉపరితలం దెబ్బతిన్నట్లు మంత్రి వెల్లడించారు.

2 పేజీలో..



పటిష్ట చర్యలు చేపట్టాలి

» ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ » క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్ల నివేదికల ఆధారంగా నిర్ణయాలు » రేపు జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి » రాష్ట్రవ్యాప్తంగా 2.61 కోట్ల మంది ఓటర్లు.. 31,460 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు » ఎన్నికల విధుల్లో దాదాపు 2.52 లక్షల మంది సిబ్బంది.. కౌంటింగ్ కోసం సుమారు 52 వేల మంది సిబ్బంది » పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత.. సీసీటీవీ, వీడియోగ్రఫీతో నిరంతర పర్యవేక్షణ » ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి » రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, స్థానిక పరిస్థితులు, మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీ ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ.. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ... వర్షాల ప్రభావం, పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది సంసిద్ధత తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, పరిమిత సంఖ్యలో కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్లు నివేదించినట్లు వెల్లడించారు.

2 పేజీలో..

వరుసగా ఐదో రోజూ లాభాల జోరు..

» 383 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ » వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభపడ్డ స్టాక్ మార్కెట్ సూచీలు » 383.55 పాయింట్లు పెరిగి 77,301.40 వద్ద స్థిరపడ్డ సెన్సెక్స్ » 149.75 పాయింట్లు లాభపడి 23,960.60 వద్ద ముగిసిన నిఫ్టీ » లాభపడ్డ బీఈఎల్, టైటాన్, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ షేర్లు » లాభాలకు అడ్డుకట్ట వేసిన ఐటీ షేర్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సూచీలు.. చివర్లో కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్నాయి. దీంతో వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభాలు నమోదయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 383.55 పాయింట్లు (0.50 శాతం) పెరిగి 77,301.40 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 149.75 పాయింట్లు (0.63 శాతం) లాభపడి 23,960.60 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ 24 వేల మార్కుకు చేరువైంది.

- మిగతా 2లో..

యూఎస్ ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమి..

» వ్యంగ్యంగా స్పందించిన ఎలాన్ మస్క్ » యూఎస్ మధ్యంతర ఎన్నికల ఫలితాలపై ఎలాన్ మస్క్ వ్యంగ్యాస్త్రాలు » రిపబ్లికన్ల కోసం 250 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినా దక్కని విజయం » సెనెట్, ప్రతినిధుల సభ రెండింటినీ కైవసం చేసుకున్న డెమొక్రాట్లు » మస్క్, ట్రంప్ విధానాలపై టెక్సాస్ నూతన సెనెటర్ జేమ్స్ టలారికో విమర్శలు » డెమొక్రాట్ల గెలుపుతో టెక్నాలజీ రంగం భవిష్యత్తుపై పెరిగిన ఆందోళన



అమెరికా : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు ఘనవిజయం సాధించడంపై టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యంగ్యంగా స్పందించారు.

- మిగతా 2లో..

ప్రజాభూమి
గురువారం, నవంబర్ 5, 2026

యూఎస్ ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమి..

- వ్యంగ్యంగా స్పందించిన ఎలాన్ మస్క్
- యూఎస్ మధ్యంతర ఎన్నికల ఫలితాలపై ఎలాన్ మస్క్ వ్యంగ్యాస్త్రాలు
- రిపబ్లికన్ల కోసం 250 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినా దక్కని విజయం
- సెనెట్, ప్రతినిధుల సభ రెండింటినీ కైవసం చేసుకున్న డెమొక్రాట్లు
- మస్క్, ట్రంప్ విధానాలపై టెక్సాస్ నూతన సెనెటర్ జేమ్స్ టలారికో విమర్శలు
- డెమొక్రాట్ల గెలుపుతో టెక్నాలజీ రంగం భవిష్యత్తుపై పెరిగిన ఆందోళన

అమెరికా : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు ఘనవిజయం సాధించడంపై టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యంగ్యంగా స్పందించారు. రిపబ్లికన్ పార్టీకి వందల మిలియన్ డాలర్లు మద్దతుగా అందించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో తన "ఎన్నికల్లో జోక్యం చేసుకునే స్పేస్ లేజర్లు" విఫలమయ్యాయంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో చురకలు అంటించారు. "ప్రస్తుతం స్పేస్‌లో డేటా సెంటర్లు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి" అని ఆయన మరో పోస్ట్ చేయడం గమనార్హం.యూఎస్ మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు అద్భుతమైన పనితీరు కనబరిచారు. యూఎస్ నెట్‌వర్క్‌ల అంచనాల ప్రకారం, సెనెట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ డెమొక్రాట్లు తిరిగి పట్టు సాధించారు. ఇది వాషింగ్టన్‌లో అధికార సమతుల్యతలో పెద్ద మార్పుకు సంకేతం. ముఖ్యంగా సాంప్రదాయకంగా రిపబ్లికన్ల కంచుకోటగా ఉన్న టెక్సాస్‌లోనూ డెమొక్రాట్లు గెలుపొందడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామం.ఈ నేపథ్యంలోనే టెక్సాస్ నుంచి సెనెటర్‌గా ఎన్నికైన జేమ్స్ టలారికో.. మస్క్, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. "మేం 300 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసిన ప్రచారాన్ని ఎదుర్కొన్నాం. సోషల్ మీడియా అల్గారిథమ్‌లను శాసించే బిలియనీర్లకు వ్యతిరేకంగా పోరాడాం" అని మస్క్‌ను ఉద్దేశించి విమర్శించారు. ట్రంప్ హయాంలో రాజకీయాలు ఒక క్రీడగా, ట్రోలింగ్‌గా మారాయని ఆయన ఆరోపించారు.ఈ ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీకి మస్క్ అతిపెద్ద ఆర్థిక మద్దతుదారులలో ఒకరిగా నిలిచారు. ఎన్బీసీ న్యూస్ ప్రకారం.. రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ ప్రచారాల కోసం ఆయన సుమారు 250 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇంత భారీగా ఖర్చు చేసినా రిపబ్లికన్లకు పరాజయం తప్పలేదు.

డెమొక్రాట్ల విజయం టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) భవిష్యత్తుపై కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఫలితాల ప్రభావంతో స్టాక్ ఫ్యూచర్లు పడిపోయాయి. టెక్నాలజీ, డేటా సెంటర్ రంగాలపై డెమొక్రాట్ల విధానాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ విజయంతో కాంగ్రెస్‌పై పూర్తి పట్టు సాధించిన డెమొక్రాట్లు, ట్రంప్ శాసనపరమైన అజెండాను సవాలు చేయడానికి సిద్ధమవుతున్నారు.

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కార్యకలాపాల్లో పాల్గొనేలా చేస్తున్నట్లు పలు ఆందోళనకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిణామాల వల్ల యువత ప్రాణాలకు ముప్పు ఏర్పడటమే కాకుండా, వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించడమైనది. విదేశీ ఉద్యోగాల పేరుతో ప్రచారం చేసే ఆకర్షణీయమైన ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సులభమైన నియామక ప్రక్రియలు, తక్కువ వ్యవధిలో విదేశాలకు పంపిస్తామనే వాగ్దానాల పట్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుర్తింపు, అనుమతులు లేని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అనధికారిక ఏజెంట్ల ద్వారా విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం సురక్షితం కాదు. విదేశాలకు వెళ్లే ముందు సంబంధిత ఉద్యోగ ఒప్పందాలు, వీసా వివరాలు, ఉద్యోగ స్వరూపం, నియామక సంస్థల చట్టబద్ధత మరియు విశ్వసనీయతను సంబంధిత అధికారిక సంస్థల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో రష్యా లేదా ఇతర దేశాలకు పంపించి, సైనిక శిక్షణ లేదా సైన్యంలో చేరేలా ఒత్తిడి చేసే మోసపూరిత ప్రయత్నాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరం. ఇటువంటి అనుమానాస్పద ఆఫర్లు, ఏజెంట్లు లేదా సంస్థల వివరాలను సంబంధిత ప్రభుత్వ అధికారులకు, పోలీసు శాఖకు తెలియజేయాలి. విదేశీ ఉద్యోగాల కోసం తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, పూర్తి స్థాయి విచారణ మరియు ధృవీకరణ అనంతరమే ముందడుగు వేయాలని యువతకు సూచించడమైనది.

సిఎం చంద్రబాబుకు ప్రధాని మోడి ఫోన్

భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల రైతులకు భారీ నష్టం వాటిల్లిందని, రోడ్లు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని వివరించారు. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని మోడి ని కోరారు. తుపాను సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం బాగా పనిచేసిందని ప్రధాని ప్రశంసించారు.

"భగినీ హస్తభోజనం వేళ గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్న శ్రీ కనకదుర్గమ్మవారు"

ఈ సందర్భంగా దాతలను ఈవో వి.కె. శీనా నాయక్ ప్రత్యేకంగా అభినందిస్తూ... గాజుల ఉత్సవం వేళ అమ్మవారి దివ్య అలంకరణ కొరకు భక్తులు సైతం తమ వంతుగా గాజులను విరాళంగా సమర్పించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కొరకు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్ : 18004259099 ను సంప్రదించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



రహదారుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

రెండు చోట్ల స్కార్స్, నాలుగు చోట్ల రోడ్డు కోతలు, ఐదు కల్వర్టు సంబంధిత పనులు దెబ్బతిన్నట్లు తెలిపారు.తుఫాన్ ప్రభావంతో 201 చెట్లు నేలకూలగా, అధికారులు తక్షణమే స్పందించి మొత్తం 201 చెట్లను తొలగించినట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో 73 చోట్ల ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడగా, ఇప్పటికే 34 చోట్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాల వారీగా పరిశీలిస్తే శ్రీకా= నెల్లూరు జిల్లాలో 66.600 కి.మీ., చీ= జిల్లాలో 52.683 కి.మీ., పశ్చిమ గోదావరి జిల్లాలో 38.572 కి.మీ., ప్రకాశం జిల్లాలో 3.600 కి.మీ., పల్నాడు జిల్లాలో 1.386 కి.మీ. మేర రహదారులుెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల కోసం మొత్తం రూ.143.36 కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో తాత్కాలిక మరమ్మతులకు రూ.16.66 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.126.70 కోట్లు అవసరమని వివరించారు.

తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ఆర్ అండ్ బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ దెబ్బతిన్న రహదారుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రహదారుల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ప్రజలకు రవాణా సౌకర్యాలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

పటిష్ట చర్యలు చేపట్టాలి

వాతావరణ పరిస్థితులు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు ఎదురైతే క్షేత్రస్థాయి అధికారుల నుంచి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ముఖ్యంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జున మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో సుమారు 2,52,000 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది కొరత తలెత్తకుండా అవసరమైన సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం సుమారు 52,000 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.

పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎదురయ్యే రవాణా, ఇతర స్థానిక సమస్యల పరిష్కారంపై కూడా సమీక్షించినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రఫీని కేవలం బయటకే పరిమితం చేయకుండా, పరిస్థితులను బట్టి లోపల కూడా నిర్వహించాలని సూచించారు. అయితే, ఓటు రహస్యానికి ఎలాంటి భంగం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నప్పుడు సంబంధిత ఘటనకు సంబంధించిన



దృశ్యాలను తప్పనిసరిగా రికార్డు చేయాలని ఆదేశించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ప్రతి ప్రిసైడింగ్ అధికారికి సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా మార్గదర్శకాలు అందించాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేని ప్రిసైడింగ్ అధికారులకు ఇతర పీవోలు లేదా పోలీసు అధికారుల ఫోన్ల ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని తెలిపారు.ఏపోలింగ్ కేంద్రాల లోపల మాల్‌ప్రాక్టీస్ లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న పక్షంలో ప్రిసైడింగ్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా జోనల్ మేజిస్ట్రేట్ లేదా పోలీసు అధికారులను సంప్రదించి పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకురావాలని సూచించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి సుమారు 2.61 కోట్లకు చేరుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు, ఎన్నికల సిబ్బంది ముందస్తు ప్రణాళికతో, క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ...

మున్సిపల్ ఎన్నికలను ఎన్నికల కమిషనర్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. అదే తరహాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి మైక్రో లెవెల్ ప్లానింగ్ రూపొందించామని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే దశలో నిర్వహిస్తున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీని నియంత్రించడం, క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, అవసరమైన చోట తగినంత పోలీసు బలగాలను మోహరించడం కీలకమని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా బలగాల మోహరింపును చేపట్టి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ మాట్లాడుతూ...

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ స్థానాల్లో మొత్తం 18,843 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టామని తెలిపారు.

కరువు నుంచి రైతన్న గట్టెక్కేలా ఆదుకోండి

200 రోజులకు వీబీ జీ రామ్ జీ పనిదినాలు పెంచాలి : ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే ప్రకృతి వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో వీబీ జీ రామ్ జీ పథకం కింద కనీస పనిదినాలను 200 రోజులకు పెంచి, వ్యవసాయ రంగానికి అవసరమైన పనులకు ఈ పథకాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కేంద్ర బృందాన్ని కోరారు. దీంతో రైతులకు మానవ వనరుల సమస్య తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కరువు పరిస్థితుల వల్ల రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని, వ్యవసాయ రుణాల చెల్లింపులపై కూడా ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో రాయలసీమలో పది ఎకరాల భూమి ఉన్న రైతులకు సైతం కరువు పరిస్థితుల దృష్ట్యా రేషన్ కార్డులు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అర్హులైన కరువు బాధిత కుటుంబాలకు డ్రాట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. దీంతో కేంద్ర సహకారంతో నిత్యావసర సరుకుల ధరలు సబ్సిడీపై అందించే వీలుంటుందని చెప్పారు. అలాగే, రైతులకు రుణాల రీషెడ్యూలింగ్ వంటి ఉపశమన చర్యలు అందేలా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జేజేఎం విస్తరణతో జల వనరుల బలోపేతం : వర్షాభావ



పరిస్థితుల కారణంగా భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయాయని ముఖ్యమంత్రి తెలిపారు. అనేక ప్రాంతాల్లో అదనంగా బోర్లు వేసినా ఆశించిన ఫలితం ఉండటం లేదని వివరించారు. అందువల్ల తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయడం, అనుసంధానించడం వంటి సమర్థ నీటి నిర్వహణ పనులకు కేంద్రం సహకరించాలని కోరారు. కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, పంటల బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన రైతుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. రైతులకు సకాలంలో పరిహారం అందితే తదుపరి పంటల సాగుకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని వివరించారు. కరువు ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాకుండా పశు సంపద, గ్రామీణ జీవనోపాధిపై కూడా పడుతున్నందున పశు గ్రాసం, తాగునీటి సరఫరా వంటి అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

15 రోజుల్లో కేంద్రానికి ఐఎంసీటీ నివేదిక : రాష్ట్రంలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను, రైతుల సమస్యలను పరిశీలించింది. రైతులతో నేరుగా మాట్లాడి పరిస్థితులను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని బృందం తెలిపింది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహాయంపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అలాగే రాష్ట్రంలో ఒకవైపు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తాంధ్ర జిల్లాల్లో తుపాను కారణంగా పంటలు, ఇతర రంగాలకు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విభిన్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ప్రత్యేకంగా స్పందించి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.




నేడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నేడు గురువారం (నవంబర్ 5) పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ వెల్లడించారు. విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నంద్యాల, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడవచ్చని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలు, నీటిలో మునిగిన కాజ్‌వేలను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.

వరుసగా ఐదో రోజూ లాభాల జోరు..

ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు.. కొద్దిసేపటికే ఒత్తిడికి లోనై నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 76,604.85 కనిష్ఠ స్థాయిని తాకింది. అక్కడి నుంచి కోలుకుని 77,396.04 గరిష్ఠ స్థాయికి చేరింది. నిఫ్టీ కూడా 23,696.15 కనిష్ఠ స్థాయి నుంచి పుంజుకుని 23,960.60 వద్ద ట్రేడింగ్ ముగించింది. బ్యాంకింగ్, ఆటో, మెటల్, మీడియా రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.

సెన్సెక్స్ షేర్లలో భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) 4.56 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. టైటాన్ 4.28 శాతం, ఇండిగో 2.39 శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.38 శాతం, ఐటీసీ 2.32 శాతం చొప్పున పెరిగాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలోనూ కొనుగోళుకనిపించాయి.మరోవైపు ఐటీ షేర్లు మార్కెట్ లాభాలకు కొంతమేర అడ్డుకట్ట వేశాయి. టీసీఎస్ 2.70 శాతం నష్టంతో సెన్సెక్స్‌లో అత్యధికంగా పడిపోయింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.23 శాతం, ఇన్ఫోసిస్ 1.65 శాతం చొప్పున నష్టపోయాయి. ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి.రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మీడియా సూచీ 5.15 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. మెటల్ 2.80 శాతం, రియల్టీ 2.85 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 2.04 శాతం, ఎఫ్ఎంసీజీ 1.50 శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే నిఫ్టీ ఐటీ 1.50 శాతం క్షీణించింది. విస్తృత మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2 శాతం, మిడ్‌క్యాప్ 100 సూచీ 1.55 శాతం పెరిగాయి. మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 2.83 శాతం తగ్గి 15.28కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు స్వల్పంగా



తగ్గాయి. డబ్ల్యూటీఐ క్రూడ్ బ్యారెల్ 95.95 డాలర్ల వద్ద, బ్రెంట్ క్రూడ్ 102.84 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
గురువారం, నవంబర్ 05, 2026

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

❖ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి ❖ వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా జరిగేలా ప్రతి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇండోర్ సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. వీలైనంత వరకు పాఠశాలల్లోని తరగతి గదులను వినియోగించుకుంటూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రత్యేకంగా ఒక్కో తరగతి గదిని కేటాయించాలని సూచిం చారు. దీనివల్ల పోలింగ్ సామగ్రి పంపిణీలో స్పష్టత, క్రమబద్ధత ఉంటుందని పేర్కొన్నారు.”

మండలాల వారీగా సెగ్మెంట్లుగా విభజించి పర్య వేక్షణ

ప్రతి మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను కొన్ని సెగ్మెంట్లుగా విభజించి, ప్రతి సెగ్మెంట్ బాధ్యత లను ఈఓఆర్డీలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు, ఎంఈఓలు, మండల ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించాలని సూచించారు. సంబంధిత అధికారులు తమకు కేటాయించిన సెగ్మెంట్లలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ సిబ్బందికి ఆహారం, రవాణా సౌకర్యాలు

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో భోజన ఏర్పాట్ల కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, తద్వారా సిబ్బంది వేచి ఉండే సమయాన్ని తగ్గించి త్వరిత గతిన భోజన సదుపాయం కల్పించాలన్నారు. వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని బస్సులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు అత్యంత సమీపంలోకి వచ్చేలా రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

రిసెప్షన్ కేంద్రాల్లోనూ పటిష్ట ఏర్పాట్లు

పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బందికి రిసెప్షన్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ సామగ్రిని జాబితా ప్రకారం అప్పగించే విధంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సామగ్రి స్వీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సిబ్బందిని త్వరగా పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి సరిపడా భోజనం, టీ, స్నాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు.



ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ రోజున వెబ్‌కాస్టింగ్ నిర్వహణ బాధ్యత ఎంపీడీవోలకు అప్పగించిన నేపథ్యంలో, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు తప్పని సరిగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం ఇంజినీరింగ్ విద్యార్థులను ముందు గానే గుర్తించి, వారికి అవసరమైన ల్యాప్ టాప్‌లను సమకూర్చాలన్నారు. జిల్లా స్థాయి నుంచి అందించే వెబ్‌కెమెరాలను వినియోగించి వెబ్‌కాస్టింగ్ నిర్వహించేలా వారికి తగిన సూచనలు, శిక్షణ ఇవ్వాలని తెలిపారు. వెబ్‌కాస్టింగ్‌కు సంబంధించిన రికార్డింగ్‌ను పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచి, తిరిగి రిటర్నింగ్ అధికారికి అందించే విధంగా స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

వర్ష సూచనల నేపథ్యంలో ముందస్తు తనిఖీలు

ప్రస్తుతం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను వర్ష సూచనల నేపథ్యంలో అధికారులు ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వర్షపు నీరు చేరకుండా, పోలింగ్ సామగ్రి తడవకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లను ముందస్తుగా సమీక్షించి, ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, మండల స్థాయి అధికారులు, డీఎల్‌డీవోలు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎన్నికలు

ప్రజాభూమి, కృష్ణా బ్యూరో:

నేడు కృష్ణా జిల్లా పరిషత్,మండల పరిషత్‌లకు ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం వరకూ హోరాహోరీగా జరిగిన ఎన్నికల ప్రచారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జడ్పీటీసీ స్థానాలకు 3681 మంది, ఎంపీటీసీ స్థానాలకు 3619 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేడు గురువారం జరిగే కృష్ణా జిల్లా పరిషత్ పరిధిలోని 26 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు, జిల్లాలోని 343 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతాయి. 26 జిల్లా పరిషత్ స్థానాలకు 74 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మండల పరిషత్ స్థానాలకు 352 మంది ఆయా పార్టీలకు చెందిన వారు పోటీపడుతున్నారు. అలాగే జిల్లా పరిషత్ స్థానాలక్కూడా ఆయా పార్టీలకు చెందిన వారు పోటీపడుతున్నారు. కాగా, 352 మండల పరిషత్ స్థానాలకు నామినేషన్లు రాగా అందులో 9 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అవి పోను 774 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. జిల్లా పరిషత్ కు 26 మందిని ఎన్నిక చేయవలసి వుండగా 74 మంది పోటీ చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో ఈ ఎన్నికలకు 9,98,055 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి వుంటుంది. ఈ ఎన్నికల కోసం 1266 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో ఓటరు రెండు ఓట్లను వేయవలసి వుంటుంది. ఒకటి జిల్లా పరిషత్‌కు, రెండోది మండల పరిషత్ కు. జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని సజావుగా పంపిణీ చేయాలన్నారు. ప్రతి మండలంలోని పోలింగ్ స్టేషన్లను సెగ్మెంట్లుగా విడగొట్టి, ప్రతి సెగ్మెంట్ బాధ్యతలను ఈవో పీఆర్డీ, డిప్యూటీ ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారులు, ఎంఈవోలు, మండల ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. ఓటు వేయడానికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో ఎటువంటి అల్లర్లు జరక్కుండా, అవసరమైన ప్రాంతాలలో పోలీసు బలగాలను కూడా ఏర్పాటు చేశారు.

నేటి జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

నేడు జిల్లా పరిషత్,మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కృష్ణా జిల్లాలో 26 మండలాలు ఉండగా 9,98,055 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలకు 352 సిగ్మెంట్లలో 1266 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అవనిగడ్డ మండలంలో 38 పోలింగ్ స్టేషన్లు ఉండగా 31,772 మంది ఓటర్లు ఉన్నారు. బంటుమిల్లిలో 48 పోలింగ్ స్టేషన్లకు 36,651 మంది ఓటర్లు ఉన్నారు. బాపులపాడు మండలంలో 91 పోలింగ్ స్టేషన్లకు 72,321 మంది ఓటర్లు ఉన్నారు. చల్లపల్లి మండలంలో 48 పోలింగ్ స్టేషన్లకు 42,825 మంది ఓటర్లు ఉన్నారు. గన్నవరం 96 పోలింగ్ స్టేషన్లకు 75,028 మంది ఓటర్లు ఉన్నారు. ఘంటసాల మండలంలో 43 పోలింగ్ స్టేషన్లకు 33,134 మంది ఓటర్లు ఉన్నారు. గుడివాడ మండలంలో 24 పోలింగ్ స్టేషన్లకు 15,588 మంది ఓటర్లు ఉన్నారు. గుడ్లవల్లేరు మండలంలో 50 పోలింగ్ స్టేషన్లకు 41,563 మంది ఓటర్లు ఉన్నారు. గూడూరు మండలంలో 55 పోలింగ్ స్టేషన్లకు 40,025 మంది ఓటర్లు ఉన్నారు. కంకిపాడు మండలంలో 70 పోలింగ్ స్టేషన్లకు 55,935 మంది ఓటర్లు ఉన్నారు. కోడూరు మండలంలో 41 పోలింగ్ స్టేషన్లకు 35,966 మంది ఓటర్లు ఉన్నారు. కృత్తివెన్ను 46 పోలింగ్ స్టేషన్లకు 37,961 మంది ఓటర్లు ఉన్నారు. మచిలీపట్నం నార్త్ 36 పోలింగ్ స్టేషన్లు ఉండగా 29,859 మంది ఓటర్లు ఉన్నారు. మచిలీపట్నం సౌత్ లో 38 పోలింగ్ స్టేషన్లకు 27,764 మంది ఓటర్లు ఉన్నారు. మోపిదేవి మండలంలో 38 పోలింగ్ స్టేషన్లకు 28,655 మంది ఓటర్లు ఉన్నారు. మొవ్వ మండలానికి 53 సిగ్మెంట్లు ఉండగా 41,469 మంది ఓటర్లు ఉన్నారు. నాగాయలంక మండలానికి 45 పోలింగ్ స్టేషన్లు ఉండగా 39,025 మంది ఓటర్లు ఉన్నారు. నందివాడ మండలంలో 44 పోలింగ్ స్టేషన్లకు 29,889 మంది ఓటర్లు ఉన్నారు. పామర్రు మండలానికి 58 పోలింగ్ స్టేషన్లు ఉండగా 43,063 మంది ఓటర్లు ఉన్నారు. పమిడిముక్కల మండలంలో 56 పోలింగ్ స్టేషన్లు ఉండగా 43,416 మంది ఓటర్లు ఉన్నారు. పెడన మండలంలో 39 పోలింగ్ స్టేషన్లు ఉండగా 27,949 మంది ఓటర్లు ఉన్నారు. పెదపారుపూడి మండలంలో 30 పోలింగ్ స్టేషన్లు ఉండగా 22,599 మంది ఓటర్లు ఉన్నారు. పెనమలూరు మండలంలో 47 పోలింగ్ స్టేషన్లకు 39,731 మంది ఓటర్లు ఉన్నారు. తోట్లవల్లూరు మండలంలో 45 పోలింగ్ స్టేషన్లకు 31,765 మంది ఓటర్లు ఉన్నారు. ఉంగుటూరు మండలంలో 58 పోలింగ్ స్టేషన్లకు 44,134 మంది ఓటర్లు ఉన్నారు. ఉయ్యూరు మండలానికి 33 పోలింగ్ స్టేషన్లు ఉండగా 29,966 మంది ఓటర్లు ఉన్నారు.

నాగాయలంక జడ్పీటీసీగా కొత్తపల్లి సరోజినీని గెలిపించండి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు విజ్ఞప్తి

నాగాయలంక, ప్రజాభూమి ప్రతినిధి



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగం గా కృష్ణా జిల్లా అవనిగడ్డ నియో జ కవర్గం నాగాయలంక మండ ల జడ్పీటీసీ అభ్యర్థిగా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తరఫున పోటీ చేస్తున్న కొత్త పల్లి సరోజినీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మండల ప్రజల సమస్యల పరిష్కారం, స్థానిక అభివృద్ధి లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, స్థానిక సంస్థల ద్వారా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని పేర్కొన్నారు.నాగాయలంక మండల ప్రజలు కొత్తపల్లి సరోజినీకి తమ విలువైన ఓటు వేసి గెలిపించాలని గుంటూరు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

26 మండలాల్లో 1,266 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు..

8,000 మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఓ అధికారి శ్రీహరి తెలిపారు. నేటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 26 మండలాల పరిధిలో మొత్తం 1,266 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల్లో పోలింగ్ బూత్‌లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం మొత్తం 8,000 మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఓ అధికారి శ్రీహరి వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

✧ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు
✧ 992 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అవసరమైన వసతులు కల్పన
✧ 16 జెడ్‌పీటీసీ స్థానాలకు 55 మంది అభ్యర్థులు పోటీలో
✧ 276 ఎంపీటీసీ స్థానాలకు పోటీపడుతున్న 631 మంది అభ్యర్థులు
✧మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



ఎన్టీఆర్ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఈ నెల 5న సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు.ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జెడ్‌పీ సీఈవో పి.సుశీలతో కలిసి బుధవారం నగరంలోని జెడ్‌పీ కార్యాలయ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 992 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 16 జెడ్‌పీటీసీ స్థానాలకు 55 మంది అభ్యర్థులు, 276 ఎంపీటీసీ స్థానాలకు 631 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వివరించారు. మొత్తం 8,35,515 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సుశిక్షితులైన పోలింగ్ సిబ్బంది:పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు మొత్తం 1,324 మంది పీవోలు, 1,283 మంది ఏపీవోలు, 3,959 మంది ఓపీవోలకు అవగాహన కల్పించి విధుల నిర్వహణకు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని నమోదు చేసి, తక్షణమే తాజా వివరాలను పంపించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

496 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, 291 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకతను పెంపొందించేందుకు అదనంగా 205 మంది వీడియోగ్రాఫర్లు, 191 మంది సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 89 రూట్లు, 45 జోన్లు ఏర్పాటుచేశామని.. పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సమర్థవంతమైన సమన్వయం, నిరంతర పర్యవేక్షణ కోసం రూట్ అధికారులు, జోనల్ అధికారులను నియమిం చామన్నారు. ఎన్నికల సిబ్బంది, అవసరమైన ఎన్నికల సామగ్రిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 188 బస్సులను ప్రత్యేకంగా కేటాయించామని తెలిపారు. దివ్యాంగ ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లను అందుబాటులో ఉంచామని, తాగునీటి సదుపాయం, నీడ, అవసరమైన క్యూలైన్లతో పాటు ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించేలా అవసరమైన సైన్ బోర్డులను, వైద్య శిబిరాలను, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని.. ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోనూ 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని తెలిపారు.

నాగాయలంకలో ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ

45 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి సిద్ధం..

లంక గ్రామాలకు పడవల ద్వారా తరలింపు ఏర్పాట్లు

నాగాయలంక, ప్రజాభూమి ప్రతినిధి



కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బుధవారం నాగాయలంక మండలంలోని టీటీడీ కల్యాణ మండ పంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పోలింగ్ బృందాలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. నాగాయలంక మండల పరిధిలోని 45 పోలింగ్ కేంద్రాలకు చెందిన సిబ్బంది సామగ్రిని స్వీకరించి, జాబితా ప్రకారం సరిచూసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం సిబ్బందిని సాయంత్రంలోగా తమకు కేటా యించిన పోలింగ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.



లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి....నాగాయలంక మండలంలోని కొన్ని గ్రామాలు లంక ప్రాంతాల్లో ఉండటంతో, అక్కడికి పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రిని పడవల ద్వారా తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి... ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఓటరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రజల భాగస్వా మ్యంతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చే యాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ విజేతలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి



అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావాలి: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అందే శ్రీరామమూర్తి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

ఇటీవల జరిగిన కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అందే శ్రీరామమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని విజేతలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, అత్యధిక నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో విజయం సాధించినప్పటికీ ప్రజల సమస్యలను, పాలనా బాధ్యతలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అందుకే ప్రజలు ఇప్పుడు కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సుపరిపాలన అందించాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోకపోతే 2029 సాధారణ ఎన్నికల్లో ప్రజల తీర్పు మరో విధంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి

రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అందే శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఒక్క అవకాశం కల్పించి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను కోరారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కార్యాలయ అడ్మిన్ కొడమంచిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ, “పల్లెలే దేశ ప్రగతికి మూలం” అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఈ సందర్భంగా జను వెంకటేశ్వరరావు, కే. కుమార్, గరికిపాటి శంకర్ బ్రహ్మం, కే. నాగేశ్వరరావు, పి. వెంకన్నబాబు తదితరులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అందే శ్రీరామమూర్తి పార్టీలోకి ఆహ్వానించారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి స్వాగతించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ప్రమాదకరంగా మారిన కూలిన ఐరన్ ఫ్రేమ్

మూడు రోజులైనా స్పందించని అధికారులు.. ప్రమాదం పొంచి ఉందంటున్న స్థానికులు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి కృష్ణా జిల్లా:

మచిలీపట్నం నగరంలోని కలేకాన్వేట 38వ డివిజన్ పరిధిలో శివగంగ గుడి మురికికాలువ రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా మారిన ఐరన్ ఫ్రేమ్ స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. స్వర్ణ కార్యాలయం పైన ఏర్పాటు చేసిన పబ్లిసిటీ ప్రకటనకు సంబంధించిన ఐరన్ ఫ్రేమ్ మూడు రోజుల క్రితం వీచిన తుఫాను గాలులకు కూలిపోయింది. అయితే, ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం కూలిన ఐరన్ ఫ్రేమ్ ప్రమాదకర స్థితిలో ఉండటంతో, మరోసారి బలమైన గాలులు వీచిన పక్షంలో సమీప భవనానికి నష్టం వాటిల్లడంతో పాటు, అటుగా రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతంలో ఇటువంటి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న ఐరన్ ఫ్రేమ్‌ను తొలగించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

గురువారం 5 నవంబర్ 2026

నివాస ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరు

- విద్యుత్ మోటార్ల సాయంతో నీటిని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు

మురుసు తుఫాన్ వల్ల కురిసిన వర్షానికి ఏలూరు జిల్లా పెదపాడు మండలం గోగుంట గ్రామంలో గల నివాస ప్రాంతాల్లోకి బుధవారం తెల్లవారుజామున 04:00 గంటల సమయంలో ఒక్కసారిగా వర్షపు నీరు చేరింది. దీంతో గ్రామంలో ఒక్కసారి తీవ్ర భయాందోళనకుంది. వర్షపు నీరు ఇళ్ళ ముందుకు చేరుకున్న విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా, రెవిన్యూ సిబ్బంది హుటాహుటిన గ్రామము చేరుకుని గ్రామ ముంపు బారిన పడకుండా సహాయ చర్యలు చేపట్టారు. విద్యుత్ మోటార్లు అమర్చి బయటికి తోడు వేస్తున్నారు. అధికారులు సమయానికి ముందస్తు చర్యలు చేపట్టకపోతే గతంలో ముంపు బారిన పడినట్టుగా మళ్లీ గ్రామం ముంపుకు గురయ్యేది గ్రామస్తులంటున్నారు. బుధవారం వర్షం ప్రభావం లేనందువల్ల ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు.





ద్వారకా తిరుమలలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు

ప్రజాభూమి ఏలూరు

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ బుధవారం ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు.అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.రాష్ట్ర ప్రజలతో పాటు ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎంపీ తెలిపారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పారితోషకాలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, అప్పలరాజు డిమాండ్



ప్రజాభూమి ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఏలూరు జిల్లా,నగర ఉద్యోగులు,సిబ్బందికి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం పారితోషకాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,సహాయ కార్యదర్శి ఏ.అప్పలరాజు అధికారులను కోరారు.ఎన్నికల విధులకు హాజరయ్యే ముందే 80 శాతం పారితోషకం అడ్వాన్స్‌గా చెల్లించాలని, విధులు పూర్తయిన 24 గంటల్లో మిగిలిన 20 శాతంతో పాటు టీఏ, డీఏలు చెల్లించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదని వారు ఆరోపించారు.ప్రిసైడింగ్ అధికారులకు రూ.2,000, పోలింగ్ అధికారులకు రూ.1,600, కౌంటింగ్ అసిస్టెంట్లకు రూ.1,350తో పాటు ఇతర స్థాయి ఉద్యోగులకు నిర్ణయించిన పారితోషకాలు చెల్లించాలని తెలిపారు.ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి బకాయిలు లేకుండా తక్షణమే పారితోషకాలు చెల్లించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కార్యకర్త స్థాయి నుంచి ఏలూరు మేయర్‌గా రెడ్డి అప్పలనాయుడు



ప్రజాభూమి ఏలూరు

సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రెడ్డి అప్పలనాయుడు అంచెలంచెలుగా ఎదిగి ఏలూరు మేయర్‌గా ఎన్నికయ్యారు.పార్టీ పట్ల నిబద్ధత,నిరంతర కృషి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలనే తపన ఆయనను ఈ స్థాయికి చేర్చాయి.కార్యకర్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన,పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.పార్టీ నాయకుడిగా, సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కూడా కీలక పాత్ర పోషించిన ఆయనకు పార్టీ అధిష్ఠానం మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించింది.ఈ నేపథ్యంలో ఏలూరు మేయర్‌గా 44,661ఓట్ల మెజారిటీ తో ఎన్నికై మరో కీలక మైలురాయిని అధిగమించారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి ఇకలేరు

ప్రజా భూమి ప్రతినిధి,పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ తవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి)(85) బుధవారం కన్నుమూశారు. ఆయనకు భార్య ఉన్నారు. ఆయన కుమారుడు అంజన్ కుమార్ ఇటీవల గుండిపోటుతో మరణించగా, కుమార్తె సబిత విదేశాల్లో కొంత కాలం క్రితం మే ప్రమాదంలో మరణించారు. డాక్టర్ బాబ్జి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేగా సేవలందించినారు.కొంతకాలం బిజెపి లో సేవలందించారు. వైసీపీలో చేరి మళ్ళీ ఎమ్మెల్యే అభ్యర్థిగాకూడా పోటీ చేశారు. వృత్తిరీత్యా ఆయన గొప్ప సర్జ్ న్ వైద్యులుగా పేరుగాంచి వేలాది ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. ఆయన మృతి పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యేలు అల్లు వెంకట సత్యనారాయణ, బంగారు ఉషారాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన వైసిపి, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,వైద్యులు, వ్యాపారవేత్తలు సంతాపం తెలిపారు.

అన్నదాతలకు అవగాహన కల్పించండి

- మురుసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి




మురుసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న బర్రింకాలపాడు నుంచి జీలుగుమిల్లి వరకు ఉన్న జాతీయ రహదారితో పాటు పి. అంకంపాలెం ప్రాంతాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించి పరిశీలించారు. తుఫాన్ కారణంగా రహదారులకు జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారులపై ఏర్పడిన నష్టాలను త్వరితగతిన గుర్తించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. మురుసు తుఫాన్ ప్రభావం నేపథ్యంలో పోలవరం నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండవాగులు, రహదారుల మధ్య ప్రవహించే వాగుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

అన్నదాతలను నట్టేట ముంచిన తుఫాన్, భారీ వర్షాలు

- నిక్కచ్చిగా ప్రతి ఎకరానికి నష్టపరిహారం అందించాలి
- అన్నదాతల డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు



వరి రైతులకు ఆర్నాబ్ తుఫాన్ తర్వాత, మురుసు తుఫాన్ పేరుతో మళ్లీ భారీ వర్షాలు రావడంతో అన్నదాత ఆశలను నెట్టేట ముంచాయి. ఉభయగోదావరి జిల్లాల్లో రెండు లక్షల పైగా ఎకరాలలో వరి సాగు జరుగుతుంది. ఇప్పటికే పెట్టుబడి ఎకరానికి రూ.30 వేలకు పైగా పెట్టేశారు. పంటలు చేతికి రావచ్చాయి. అయితే ఆర్నాబ్ తుఫాన్ పేరు తో వరి చేలన్నీ నేరకోరిగిపోగా, ఎంతో కొంత శాతం మిగులుతాయి అనుకున్న తరుణంలో మళ్లీ మురుసు తుఫ్తాన్ తో పేరుతో భారీ వర్షాలు రావడంతో అన్నదాతల ఆశలన్నీ అడియాసలైపోయాయి. రెండు మూడు రోజులుగా కురిసిన కొండపూత వర్షాలు ఉన్న వరి పొలాలను మొత్తం నీట ముంచి వేశాయి. దీంతో మొత్తానికి వరి కంకులన్నీ కుళ్ళిపోయి రూపాయి కూడా చేతికి రాకుండా పోతుందని, పెట్టిన పెట్టుబడి ఎకరానికి 30 వేల రూపాయలు పైబడి గంగపాలు అయిపోయినట్లేనని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

నిక్కచ్చిగా ప్రతి ఎకరానికి నష్టపరిహారం అందించాలి.:

ఆర్నాబ్ తుఫాను, మురుసు తుఫాన్ భారీ వర్షాలు కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి నష్ట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. దీనికోసం గ్రామాలను యూనిట్గా తీసుకుని ప్రతి ఎకరాన్ని పరిగణలోకి తీసుకుని తప్పనిసరిగా నష్టపోయిన ప్రతి రైతుకి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీనికోసం వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు కచ్చితంగా పొలాలకు వెళ్లి నిక్కచ్చిగా అవసరమైతే డ్రోన్లు సహాయంతో నష్టపరిహారం లెక్కలు వేసి చెల్లించాలని గతంలో మాదిరిగా తుతూ మంత్రం గా కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నష్టపరిహారం అందకపోతే అందుకు బాధ్యులను అధికారులను చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఆరటి, కొబ్బరి తోటలు కూడా నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

మురుసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న బర్రింకాలపాడు నుంచి జీలుగుమిల్లి వరకు ఉన్న జాతీయ రహదారితో పాటు పి.అంకంపాలెం ప్రాంతాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు సందర్శించి పరిశీలించారు. తుఫాన్ కారణంగా రహ దారులకు జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బం దులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదా రులపై ఏర్పడిన నష్టాలను త్వరితగతిన గుర్తించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ మురుసు తుఫాన్ ప్రభావం నేపథ్యం లో పోలవరం నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుం డా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ము ఖ్యంగా కొండవాగులు, రహదారుల మధ్య ప్రవహించే వాగు ల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలు వాటిని దా టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచిం చారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన జాగ్ర త్తలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలకు విజ్ఞ ప్తి చేశారు. తుఫాన్ పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సహకరిం చాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు బ్యాంకులకు సెలవు

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

నేడు కాకినాడ జిల్లాలో నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు, కళాశాలలకు, బ్యాంకులకు అంగన్వాడీ కేంద్రాలకు వివిధ సంస్థలకు సెలవు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధులు, ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

మీడియాకు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు




స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ముఖ్యంగా సాధారణ రోజుల్లో సమాచారం మాట ఎలా ఉన్నా ,ప్రస్తుతం ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి గత నాలుగైదు రోజులుగా ఏ విధమైన సమాచారం మీడియాకు అందజేయడం లేదు. వ్యక్తిగతంగా కాకపోయినా మండల పరిధిలో మీడియాకు సంబంధించి పలు వాట్సాప్ గ్రూపులో ఉన్నాయి.

తరచుగా వాట్సాప్ గ్రూపులో సమాచారం ఇచ్చేవారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో అలాంటి సమాచారం ఇవ్వకుండా సంబంధిత మండల అధికారులు సైలెంట్ గా ఉంటున్నారు. ఏదైనా సమాచారం అడుగుదామని అధికారులకు ఫోన్ చేసినప్పటికీ ఫోన్లు సైతం ఎత్తకపోవడంతో ఎన్నికలకు సంబంధించి ప్రజలకు మీడియా తరఫున ఎటువంటి సమాచారం ఇవ్వలేకపోవడం జరుగుతోంది. ఒకపక్క ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మరోపక్క పోలీస్ యంత్రాంగం, గురువారం మండల పరిధిలో జరగనున్న ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఐదు గంటల వరకు ఏ విధమైన సమాచారం ఇవ్వకపోవడంతో ప్రత్యేకించి ఎన్నికలకు సంబంధించి ఏ విధమైన సమాచారం మీడియా ద్వారా ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా కాజులూరు మండలంలో మొత్తం 29 ఎంపీటీసీ...స్థానాలకు 48 మంది అభ్యర్థులు మండల పరిధిలో 20 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయనున్నారు. వైకాపా -20, టిడిపి నుండి 11, జనసేన నుండి 10, మంది బిజేపి -1, స్వతంత్ర అభ్యర్థులు 6,గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఏలేశ్వరం మున్సిపాలిటీలో కూటమి జయకేతనం

- చైర్‌పర్సన్‌గా యార్లగడ్డ అక్షిత ఎన్నిక

కాకినాడ జిల్లా - ప్రత్తిపాడు నియోజకవర్గం:



ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి పురపాలక పీఠాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 28 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 21 స్థానాల్లో విజయం సాధించగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు 7 వార్డులను గెలుచుకున్నారు. కూటమి తరఫున గెలుపొందిన 21 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 15 వార్డులను, జనసేన పార్టీ 5 వార్డులను, భారతీయ జనతా పార్టీ ఒక వార్డును కైవసం చేసుకున్నాయి. కౌన్సిలర్ల సంఖ్యాబలం కూటమికి అనుకూలంగా ఉన్నప్పటికీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక మాత్రం ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు కూటమి అభ్యర్థి యార్లగడ్డ అక్షిత 255 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఏలేశ్వరం మున్సిపల్ పీఠం కూటమి ఖాతాలో చేరింది. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు, చైర్‌పర్సన్ యార్లగడ్డ అక్షితకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కూడా విజయం సాధించిన అభ్యర్థులను అభినందించారు. పట్టణ అభివృద్ధికి నూతన చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లందరూ సమష్టిగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఏలేశ్వరం పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ఏలేశ్వరం మున్సిపాలిటీలో కూటమి 21 స్థానాలతో మున్సిపల్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయగా, చైర్‌పర్సన్‌గా యార్లగడ్డ అక్షిత బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రజాభూమి

కోనసీమ 5

గురువారం 5 నవంబర్ 2026

మెట్ట ప్రాంతాన్ని ముంచేత్తిన మురుసు తుఫాను!

• అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ!

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట



మురుసు తుపానుతో మెట్ట ప్రాంతంలోని అనేక గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. వాగులు, వంకలు పొర్లు పొంగుతున్నాయి. గ్రామాలలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారై ప్రజలకు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నాయి. కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామం లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకి తడికలపూడి ఎస్సీ కాలనీ స్మశానం వద్దనుండి భారీగా వర్షం నీరు గ్రామంలోని కాలనీలో ఉన్న ఇళ్లల్లోకి నీళ్ళు చేరడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారు ఈ విషయం తెలుసుకున్న గ్రామంలోని నాయకులు గ్రామ పెద్దలు గ్రామస్తులతో అందరూ కలిసి జెసిబి ని ఏర్పాటు చేసి ఆ వర్షపు నీరు చెరువులలోకి చేరే విధంగా జెసిబి లో సాయంతో కాలవలు తీయడం జరిగింది . ఈ కార్యక్రమంలో తూత లక్ష్మణరావు బొంతు వెంకటేశ్వరరావు తడికలపూడి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూ త బాలాజీ కుమార్ మోటే పల్లి రామకృష్ణ సింగవరపు హరీష్ బాబు కోలా కిషోర్ గ్రామంలోని నాయకులు గ్రామంలోని యువకులు గ్రామస్తులు పాల్గొని కాలనీలోకి నీళ్లు రాకుండా కాలువలు తీసి చెరులోకి వెళ్లేలాగా ప్రజలు చేసుకుంటున్నారు. ఎక్కడికి ఎక్కడికి గ్రామస్తులు ఆయా గ్రామాల్లో నీరు పోయెటేందుకు తాత్కాలిక డ్రైనేజీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ముసురు తగ్గితేనే కానీ శాశ్వతంగా పనులు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆ గ్రామం ఈ గ్రామం అనకొండ గా అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది.



జాతీయ రహదారులు , కాలువలు పొంగు పరులుతున్న వద్ద పోలీసులు పహారా!

ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

ముసురు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న కాలువల వద్ద, ప్రధాన రహదారుల వద్ద, లక్ష్మీపురం వద్ద, జీలుగుమిల్లి వద్ద, ప్రధాన రహదారుల పైన నీరు ప్రవహించడంతో రాకపోకలలో తీవ్ర ఆటంకం ఏర్పడడంతో జీలుగుమిల్లి ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పహారక నిర్వహించారు. ఈ వాగులు వంకల్లో పొంగిపోవడం గత దశబ్ద కాలంలో ఎవరు చూడలేదు. రాకపోకలు నియంత్రణించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ముఖ్యంగా కొండవాగులు, రహదారుల మధ్య ప్రవహించే వాగుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని ఎస్సై సూచించారు.



పంట పొలాలను వరద నీటితో

ముంచెత్తిన మురసు

ప్రజాభూమి, బుట్టాయగూడెం

మొన్నటిదాకా సాగుకు చుక్క నీరు దొరకని పరిస్థితిలో కొట్టు మిట్టాడిన రైతును మురసు తుఫాను నిండా ముంచింది. ముంసు తుఫాను ప్రభావంతో బుధవారం బుట్టాయగూడెం మండలంలో అత్యంత భారీ వర్షపాతం నమోదయింది. కొండవాగులు కాలువలు, పొంగిపొర్లాయి. చెరువులు కట్టలు తెంచుకొని ప్రవహించడంతో వరద నీరు పంట పొలాలను ముంచెత్తింది. మండలంలో సుమారు వెయ్యి ఎకరాలలో వేసిన పొగాకు తోటలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు గ్రామాలలో నివాస ప్రాంతాలు నీట మునగడంతో, వంట చేసుకునే వీలు కూడా లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని గగ్గోలు పెట్టారు. కొండ వాగులు, కాలువలు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు వీలు లేక మండలం జలదిగ్బంధనంలో చిక్కుకున్నట్లు అయింది. రామారావు పేట సెంటర్ వద్ద 365 బిబి జాతీయ రహదారి పై నిర్మాణంలో ఉన్న వంతెన సెంట్రింగ్ కొండ కాలువ వరద ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. సెంట్రింగ్ పడిపోయే సమయాని కి ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సాయం త్రానికి వర్షం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల్లో

కూటమి ఘన విజయం





• ప్రజల నమ్మకమే విజయానికి నిదర్శనం

• ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు

కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఐక్యతకు ప్రజలు ఘన విజయాన్ని అందించారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. నగర ప్రజల నమ్మకమే మరోసారి కూటమికి పట్టం కట్టిందని వారు స్పష్టం చేశారు.కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన సందర్భంగా పవర్‌పేటలోని తన క్యాంపు కార్యాలయంలో మేయర్ రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ చరిత్రలో గుర్తుండిపోయే విజయాన్ని అందించిన నగర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో పక్కా పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని అన్ని ప్రాంతాల్లో సమర్థవంతంగా అమలు చేయడం వల్లే కూటమి విజయాన్ని సొంతం చేసుకుందని చంటి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఎలాంటి పైరవీలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు.'రఫారఫా' అంటూ విరుచుకుపడిన వైసీపీకి ఏలూరు ఎన్నికల ఫలితాలు గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానించారు. 2021 కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీకి కేవలం మూడు డివిజన్లు మాత్రమే వచ్చాయని,ఇప్పుడు వైసీపీకి మూడు డివిజన్లే మిగిలాయని పేర్కొంటూ గత ఎన్నికల బాకీని ప్రజలు తీర్చేశారని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ,రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు తాజా కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. తన విజయానికి పూర్తి బాధ్యత తీసుకుని అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే బడేటి చంటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ మరింత చైతన్యవంతంగా పాలన సాగించనుందని ఆయన అన్నారు. కార్పొరేటర్ల గౌరవం మరింత పెరిగేలా నగర పాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి మరడాని రంగారావు,గుడిపూడి. రవిబాబు,ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఈడీఏ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు,మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు,నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి శక్తి టీమ్ బ్రేక్



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

బాల్య వివాహాల నిరోధంలో ఏలూరు జిల్లా పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన శక్తి టీమ్ సభ్యులు ఆర్ఆర్ పేట పాములదిబ్బలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించి వివాహాన్ని నిలిపివేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రభావాలను గురించి వివరించి, బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాలికలకు విద్య అందించి వారి లక్ష్యాలను చేరుకునేలా ప్రోత్సహించాలని, బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

తాళ్లపూడిలో భారీ వర్షం.. జలమయమైన రోడ్లు

• ఎన్నికల ఏర్పాట్లకు వర్షం ఆటంకం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్ల సందడి.. మరోవైపు ముసురు తుఫాను ప్రభావంతో భారీ వర్షం. తాళ్లపూడి మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు బయలుదేరే సమయంలో ప్రారంభమైన వర్షం సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా కురవడంతో ఎన్నికల ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే రోడ్లు, వీధులు నీటితో నిండిపోయాయి. బుధవారం కురిసిన భారీ వర్షంతో మరింతగా నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి సిబ్బంది బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షం తగ్గిన తర్వాతే పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల నిర్వహణకు వాతావరణం సవాలుగా మారింది.

వైకాపా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చింతపల్లి కీలక వ్యాఖ్యలు

• రామచంద్రాపురం వైసీపీలో రాజకీయ కలకలం

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపల్ ఎన్నికలు ముగిసిన కొద్ది గంటల్లోనే వైకాపా తరపున పోటీ చేసి ఓటమి పాలైన చింతపల్లి నాగేశ్వరరావు ఆపార్టీ నేతలపై కీలక వ్యాఖ్యలు చేయడంతో దుమారం చెలరేగింది. దీంతో రాజకీయ చర్చకు దారితీసే పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన చింతపల్లి నాగేశ్వరరావు తాజాగా బుధవారం విడుదల చేసిన వీడియోలో కీలక వ్యాఖ్యలు చేశారు.తన ఓటమికి మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆయన తనయుడు సూర్యప్రకాష్ కారణమని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, వారిని నమ్ముకుని భవిష్యత్తులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎవరూ పోటీకి దిగవద్దంటూ సూచనలు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రామచంద్రపురం మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిగా తనని పోటీలో దింపిన తరువాత నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎన్నికలు దగ్గరపడే సమయంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ కానీ,ఆయన తనయుడు నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్ కాని సహకరించలేదని నాగేశ్వరరావు ఆరోపించారు.అలాగే బోస్ తనని దుర్భాషలాడినట్లు నాగేశ్వరరావు ఆరోపించారు.దీంతో తాను ఆర్థికంగా చాలా నష్టపోయానని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం చింతపల్లి నాగేశ్వరరావు చేసిన ఈ వ్యాఖ్యలు స్థానిక వైసీపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.పార్టీ ముఖ్య నేతలపైనే బహిరంగంగా ఇలాంటి విమర్శలు చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది ఆయన విడుదల చేసిన వీడియోపై పార్టీ శ్రేణులు, స్థానిక రాజకీయ నాయకులు స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

గోమాతను హింసించి చంపిన కేసులో

ఇద్దరికి 15 రోజుల రిమాండ్

• రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

• గోమాతపై అత్యాచారం జరిగిందంటున్న హిందూ సంఘాలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట



ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో ఆవును (గోమాత) హింసించి చంపిన ఘటనలో ఇద్దరు నిందితులకు కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. వాడపల్లి గ్రామానికి చెందిన గంధం కేశవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన అన్నవరపు వెంకన్నబాబు, చామకూర వెంకటరమణ అనే ఇద్దరు వ్యక్తులపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులను పోలీసులు కోతపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 15 రోజుల రిమాండ్ విధించిందని, దీంతో నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్సై తెలిపారు.

గోమాతపై అత్యాచారం జరిగింది : హిందూ సంఘాల ప్రతినిధులు

ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో గోమాతపై ముగ్గురు అత్యాచారం చేసి హత్య చేసారని హిందూ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. ఈ ఘటనపై హిందూ చైతన్య వేదిక, హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన ముగ్గురు నిందితులపై కఠినమైన కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న పవిత్ర వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఉన్న గ్రామంలో ఇటువంటి దారుణ ఘటన చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని, సమాజంలోని అన్ని వర్గాల వారు సమిష్టిగా స్పందించి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేయాలని జిల్లా హిందూ చైతన్య వేదిక అధ్యక్షులు గాదిరాజు ప్రసాదరాజు, సంస్కృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు పేరిచర్ల సంజయ్ వర్మతో పాటు హిందూ సంఘాల ప్రతినిధులు, గోసేవకులు, గోరక్షకులు కోరారు. ఖండ ధర్మజాగరణ ప్రముఖ్ శ్రీనివాసరెడ్డి, ఖండ సేవ ప్రముఖ్ సూరిబాబు, ఖండ గోరక్షా ప్రముఖ్ శ్రీనివాసరావు తదితరులు ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ నిందితులకు కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు.

రైతులు నీటి కాలువలు తీసుకోవాలి

ప్రజా భూమి ప్రతినిధి - చాట్రాయి




ముసురు తుఫాను వలన కురిసిన అధిక వర్షాలకు వరి పంట దెబ్బతినకుండా రైతులు నీటి/మురుగు కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. అధికముగా కురిసిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలనీ మండల వ్యవసాయ శాఖ అధికారి బుధవారం రైతులకు తెలిపారు.పడిపోయిన పంటలో కంకి విత్తనాలు మొలకెత్తకుండా, రంగు మారకుండా నివారించేం దుకు లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు కలిపి(5% శాతం ఉప్పు ద్రావణం) పిచికారి చేయాలని తెలియజేయడమై నది. వరి గింజలు రంగు మారకుండా పొడ తెగులు,మాని పండు తెగులు రాకుండా ఒక ఎకరానికి ప్రోపికోనజోల్ 25% జుజ మందును 200 ఎఫ్ఎ (లేదా) హెక్సకోనజోల్ 5% ఎస్ జ మందును 400ఎఫ్ఎ నీటిలో కలుపుకొని పిచికారి చేసిన యెడల నష్టం వాటిల్లకుండా పంటను కాపాడుకోవచ్చు.ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో నీరు తగ్గించిన వెంటనే పైపాటుగా ఎకరానికి 20 కేజీలు యూరియాను, 20 కేజీలు పొటాష్ ను పంట ఎదుగుదలకు చల్లుకోవాలనీ అన్నారు.అతిముఖ్యంగా వర్షాల ప్రభావం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరించిన విధంగా ఈ రెండు రోజులు వరి కోతలు ఆపుకోవడం మంచిదని సూచించడమైనది.

పెద్దవాగు వరదపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సమీక్ష

• అధికారులకు కీలక సూచనలు

ప్రజాభూమి ఏలూరు



తెలంగాణ నుంచి పెద్దవాగుకు భారీగా వరదనీరు చేరుతున్న నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్, మండల తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితిని సమీక్షించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు.వరద బాధితులకు ఆహారం, తాత్కాలిక పునరావాసం కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకులను కోరారు.అత్యవసర సహాయం కోసం తనను లేదా ఏలూరు క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

గురువారం 05 నవంబరు 2026

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణ సహాయం అందించిన ఎంపీ అంబికా

ప్రజాభూమి ప్రతినిధి,
అనంతపురం



అనంతపురం నగరంలోని బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫ్లైఓవర్ (రాంనగర్ ఫ్లైఓవర్) పై బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని గమనించిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో పాటు, ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వ్యక్తికి మంచినీరు అందించి, మెరుగైన వైద్యం కోసం ఆటోలో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే బాధితుడు అందుకు అంగీకరించకపోవడంతో 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ వాహనదారులు అతివేగానికి దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు.

కౌన్సిలర్లుగా భార్యాభర్తలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పురపాలక సంఘం ఎన్నికల్లో ముద్దిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులైన భార్యాభర్తలు మంచాల రూప, మంచాల మారుతి ఘన విజయం సాధించారు. 51వ వార్డు నుంచి మంచాల రూప, 49వ వార్డు నుంచి మంచాల మారుతి పోటీ చేసి విజయం సాధించడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ విజయంతో వారి కుటుంబ సభ్యులు, టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఆయా వార్డుల్లో భార్యాభర్తలు వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహించి ఇరువురు విజయం సాధించారు. ఒకే పార్టీకి చెందిన ఇరువురు కౌన్సిలర్లుగా పోటీ చేసి గెలుపొందడం గమనార్హం.

ఎన్నికల వేళ పోలీసుల అప్రమత్తం..
నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!

నార్పల మండలంలో 144 సెక్షన్ అమలు.. 70 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు-ఓటర్లు ఓటు వేసిన వెంటనే ఇళ్లకు చేరుకోవాలి: ఎస్ఐ సాగర్

ప్రజా భూమి నార్పల



నార్పల మండలంలో నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు వులేకుండా ప్రశాంతంగా జరిగేలా మండలవ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు నార్పల ఎస్ఐ సాగర్ వెల్లడించారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా సంచరించరాదని, ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే నేరుగా ఇళ్లకు వెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడటం, మొబైల్ ఫోన్లు తీసుకెళ్లడం నిషేధమని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు అనుమతి లేదన్నారు. అనుమతి లేని ర్యాలీలు, సభలు, విజయోత్సవాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 70 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇందులో 10 మంది ప్రత్యేక పోలీసు బలగాలు, 10 మంది మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. సీఐ, డీఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక బలగాలతో నిరంతర భద్రత కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ సాగర్ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పకడ్బందీగా ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
-రూరల్ మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు
-334 మంది సిబ్బంది నియామకం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలో గురువారం జరగనున్న ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మొత్తం 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన ఎన్నికల సిబ్బందిని నియమించారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 15 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానం ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 43,155 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు, ఇందుకోసం 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో), ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి (ఏపీవో) చొప్పున మొత్తం 52 మంది పీవోలు, 52 మంది ఏపీవోలను నియమించారు. వీరితో పాటు సుమారు 230 మంది ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవోలు) ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మండల ఎన్నికల అధికారి శివానంద నాయక్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని మండల ఎన్నికల అధికారి శివానంద నాయక్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదరమ్మ, ఎంఈవో గంగప్ప, ఎంఈవో–2 ప్రకాష్‌తో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి...

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం





జిల్లా వ్యాప్తంగా 2వ సాధారణ ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి -2026 ఎన్నికల నందర్భంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండ, వజ్రకరూర్, కూడేరు మండలాలలో ఆయా ప్రాంతాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ (ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్) కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల సామాగ్రి కంపెనీ వనులను జాయింట్ కలెక్టర్ వరిశీలించి అధికారులకు తగు సూచనలను ఆదేశాలను జారీ చేశారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే విధులు నిర్వర్తించాలని ఎట్టి పరిస్థితుల్లో లోటు పాట్లకు తావు ఇవ్వకూడదని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, జడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో ఆయా పనులను పూర్తి చేయాలన్నారు. నేడు ఎన్నికల సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు జాగ్రత్తగా తరలించు కోవాలని అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బందు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటింగ్ సమయానికల్లా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కోరారు. పోలింగ్ నిర్ణీత సమయానికే ప్రారంభించాలని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు నేటి సాయంత్రం కల్లా పూర్తి చేసుకోవాలని అలాగే కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను మరియు శాంతి భద్రత పరిరక్షణకు పోలీసు శాఖ చర్యలు తీసుకో వాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు విధులను నిర్వర్తించే వారందరూ ఎలాంటి నిర్లక్ష్యం అలసత్వం ప్రదర్శించకుండా బాధ్యతా యుతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించి సమర్థవంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఆర్వోలు, ఎంపీడీవోలు, తాసిల్దార్ లు అరుణ , జయశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు కూడేరు ఆర్.ఓ. జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలి -ప్రజాతీర్పుతో మరింత బాధ్యత
-విజేతల అభినందన సభలో నవీన్ నిశ్చల్



ప్రజాభూమి, హిందూపురం టౌన్ ఎన్నికల్లో ప్రజా తీర్పుకు అనుగుణంగా గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఆగ్రో సంస్థ చైర్మన్, శ్రీ సత్య సాయి జిల్లా జనసేన సమన్వయకర్త నవీన్ నిశ్చల్ సూచించారు. కేంద్ర, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు అనుగుణంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పునిచ్చారన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో పుట్టపర్తి, మడకశిర మున్సిపాలిటీలను జనసేనకు కేటాయించగా రెండు చోట్ల చైర్మన్ అభ్యర్థులు గెలవడం సంతోషకరమన్నారు. అదే విధంగా హిందూపురంలో 5 మంది జనసేనకులు మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నిక కావడం ఎంతో హర్షణీయమని, చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికైన వారు నిత్యం ప్రజా సేవకు పాటుపడాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకొని జనసేన ప్రజా ప్రతినిధులు ప్రజాసేవకు అంకితం కావాలన్నారు. భవిష్యత్తులో కూడా కూటమి పార్టీలు ఇదే తరహాలో సమైక్యతతో మెలిగి ప్రజాసేవకు దోహదపడాలని నవీన్ తెలిపారు. పేద ప్రజల కోసం పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రధాన సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఇక నుండి జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు నిత్యం ప్రజా సమస్యలపై దృష్టి పెడుతున్నారని, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ప్రజా ప్రతినిధులు కూడా అదే తరహాలో ప్రజాసేవకు పాటుపడాలన్నారు. మున్సిపల్ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకొని కూటమి పార్టీలు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఘనవిజయం సాధించాలని ఇందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని కోరారు నవీన్ నిశ్చల్. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఎన్నికల ద్వారా పార్టీ అభివృద్ధి చెందడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి మార్గం దొరుకుతుందన్నారు. అనంతరం పార్టీ తరపున విజేతలుగా నిలిచిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు పోలింగ్ మెటీరియల్ పంపిణీ త్వరితగతిన పూర్తి కావాలి..
-: రేపటి 5వ తేదీన పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి..
-: నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్,
- జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్..





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీ త్వరితగతిన పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రేపటి 5వ తేదీన జిల్లాలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రానికి సంపూర్ణ సామగ్రి అందేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల అధికారులకు మెటీరియల్ పంపిణీ వేగంగా పూర్తి చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కోసం అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతానికి అయితే ఎటువంటి సమస్యలు లేవన్నారు. ఈరోజు సాయంత్రం లోపల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.. పోలింగ్ స్టాఫ్ చేరుకునే లొకేషన్స్ లో కూడా దానికి సంబంధించిన ఏర్పాట్లు, భోజనం ఏర్పాట్లు, వసతి లాంటి సౌకర్యాలు అన్నీ కూడా చేశామన్నారు. ఈరోజు డిస్ట్రిబ్యూషన్ కూడా చాలా చక్కగా జరుగుతున్నాయని, ప్రతి చోట కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో షామియానాలు, ఇతర ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది.. జోనల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క పోలింగ్ బూత్ కి సంబంధించిన మెటీరియల్స్ ఆ పోలింగ్ సిబ్బందికి అందజేయడం జరుగుతున్నాయన్నారు జిల్లా వ్యాప్తంగా రేపటి పోలింగ్ సంబంధించిలా అండ్ ఆర్డర్ ఏర్పాట్లు కూడా చాలా వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి ఎటువంటి అసౌకర్యం కలగకూడదని, అన్ని ఏర్పాట్లు సజావుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పోలింగ్ మెటీరియల్ అన్ని కేంద్రాలకు చేరేందుకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ అభివృద్ధే నా విజయానికి బాటలు వేసింది...
-ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. హిందూపురం అభివృద్ధికి కట్టుబడి ఉంటా -మున్సిపల్ చైర్మన్ పీఎస్ మంజునాథ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తన విజయానికి ప్రధాన కారణమని కూటమి పార్టీల తరఫున మున్సిపల్ చైర్మన్ గా బరిలో నిలిచి విజయం సాధించిన పీఎస్ మంజునాథ్ హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోనని, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తనకు అండగా నిలిచి విజయం అందించిన ప్రతి ఒక్క ఓటరుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేస్తున్న కృషి, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గుర్తించారని తెలిపారు. ఆ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు తమ ఓటు ద్వారా విశ్వాసాన్ని ప్రకటించారని ఆనందం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణుల సమష్టి కృషి విజయానికి దోహదపడిందన్నారు. ఎన్నికల ప్రచారంలో రాత్రింబవళ్లు శ్రమించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన పట్టణ ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో విజయం సాధించడం బాధ్యతను మరింత పెంచిందని మంజునాథ్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పట్టణంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు ముందుంటానని తెలిపారు. హిందూపురం పట్టణాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మార్గదర్శకత్వంలో, కూటమి నాయకుల సహకారంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తనకు అందించిన ఈ విజయాన్ని వ్యక్తిగత విజయంగా కాకుండా హిందూపురం అభివృద్ధికి ప్రజలు ఇచ్చిన బాధ్యతగా భావిస్తున్నానని మంజునాథ్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ధీమా వ్యక్తం చేశారు.

తెలుగుదేశం పార్టీ నంద్యాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబాన్ ఘన విజయం



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం (నంద్యాల)

నంద్యాల మున్సిపల్ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ బాబన్ 8,407 ఓట్లతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం అనంతపురం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంద్యాల జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రభాకర్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందించారు కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబాన్. కొంతసేపు ఇద్దరు ఏకాంతంగా ఏ విధంగా ఎలక్షన్, పోలింగ్ విశేషాలు గూర్చి వివరించారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
గురువారం 05 నవంబరు 2026

క్రైస్తవులపై దాడులు ఆపండి.. చర్చిలను కాపాడండి

- చర్చిల మరమ్మతుకు రూ.3 లక్షలు.. పాస్టర్ల వేతనం రూ.10 వేలకు పెంచాలి
- ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలి
- గవర్నర్ కు వినతి పత్రం అందించిన డాక్టర్ కోలా ప్రసాద్ బృందం

ప్రజాభూమి, పులివెందుల:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, చర్చిల కూల్చివేతలు, ప్రార్థనా మందిరాలపై దాడులు, క్రైస్తవులపై నమోదవుతున్న తప్పుడు కేసులు తదితర అంశాలపై యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్ నేతృత్వంలో క్రైస్తవ ప్రతినిధుల బృందం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తగిన చర్యలు చేపట్టేలా చూడాలని కోరడం జరిగిందన్నారు.రాష్ట్రంలో క్రైస్తవులు, పాస్టర్లు, మత పెద్దలపై జరుగుతున్న



దాడులపై నిష్పక్షపాత విచారణ జరిపించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ సమాజానికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.చర్చిలు, ప్రార్థనా మందిరాలపై దాడులు, చట్టవిరుద్ధమైన కూల్చివేతలను నిరోధించాలని, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన వివాదాల్లో చట్టబద్ధమైన విధానాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులపై నమోదవుతున్న తప్పుడు కేసులను నిరోధించాలని, చర్చిల మరమ్మతులకు రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రాష్ట్రంలో మరమ్మతులు అవసరమైన చర్చిలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో చర్చికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.క్రైస్తవుల అంత్యక్రియల నిర్వహణకు అనేక ప్రాంతాల్లో స్థల సమస్యలు ఎదురవుతున్నందున, ప్రతి గ్రామంలో క్రైస్తవ శ్మశానవాటిక కోసం తగిన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఉన్న శ్మశానవాటికలను ఆక్రమణల నుంచి పరిరక్షించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.పాస్టర్ల గౌరవ వేతనం రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచాలని కోరారు. ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, సమానత్వం, భద్రత హక్కులు పరిరక్షించబడాలని కోరారు.క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా, చట్టవరమైన మార్గాల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

సుస్థిర జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన

-నీటి వనరుల సంరక్షణ, పొదుపుపై ప్రత్యేక కార్యక్రమాలు



ప్రజాభూమి, సిద్ధవటం: సుస్థిర జీవనశైలిలో భాగంగా నీటి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, సుస్థిర ఆహార వ్యవస్థల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప తెలిపారు. కడప జిల్లా ఫారెస్ట్ అధికారి బాలరాజు ఆదేశాల మేరకు గత నాలుగు రోజులుగా బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆయన వివరించారు. మంగళవారం శ్రీ నలంద పాఠశాల విద్యార్థులను సాహెబ్ బావి రహదారి సమీపంలోని చెక్‌డ్యామ్, ఇంకుడు గుంతల వద్దకు తీసుకెళ్లి నీటి వనరుల సంరక్షణ, పొదుపు, నీటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కపర్దీశ్వర కోన సమీపంలో సుస్థిర ఆహార వ్యవస్థల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా విత్తన బంతులను చల్లించారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప, డిప్యూటీ రేంజర్ మక్తర్ భాష, సెక్షన్ ఆఫీసర్ సురేష్ బాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో కూటమి ప్రభంజనం

-పులివెందులలోనూ వైసీపీకి ఎదురుదెబ్బ - జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: ఉమ్మడి కడప జిల్లాలోని నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కూటమి ప్రభంజనం వీచిందని, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సొంతగడ్డ పులివెందులలోనూ ఓటర్లు వైసీపీని తిరస్కరించారని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సిద్ధవటంలోని ఆకుల వీధిలో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలువుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారని, పట్టణ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి 'సూపర్ హిట్' కొట్టిందని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై అధికార బలంతో జరిగిన దౌర్జన్యాలను ప్రజా ప్రతినిధులు గుర్తుచేసుకోవాలని, దానికి ప్రజలు ఈ ఎన్నికల ద్వారా తగిన సమాధానం చెప్పారన్నారు. మాజీ సీఎం జగన్ సొంతగడ్డ పులివెందులలోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని కూటమి పార్టీకి విజయాన్ని అందించారని తెలిపారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ వైకాపాకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. ఓబులయ్య, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, జనసేన నాయకులు పసుపులేటి గంగయ్య, విజయ్, షేక్ గౌస్ బాషా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వివాదాలకు కోర్టు అవసరం లేదు.. మాటలతోనే పరిష్కారం

కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం

గ్రామస్థాయి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్



ప్రజాభూమి,పులివెందుల
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తలెత్తే చిన్న చిన్న వివాదాలను పరస్పర చర్చలు, అవగాహన, సయోధ్య ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం పులివెందుల మండలం తుమ్మలపల్లిలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా ధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో కమ్యూనిటీ మధ్యవర్తులను నియమించినట్లు తెలిపారు.కుటుంబ సమస్యలు, భూ సంబంధిత వివాదాలు, ఆస్తి తగాదాలు, ఇతర సామాజిక సమస్యలను స్థానికంగా పరస్పర చర్చలు, సయోధ్య ద్వారా పరిష్కరించుకునే అవకాశం కమ్యూనిటీ మధ్యవర్తిత్వం కల్పిస్తుందన్నారు. కోర్టులకు వెళ్లకుండానే స్థానిక స్థాయిలో వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవడంతో పాటు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, సామాజిక ఐక్యత పెంపొందుతాయని వివరించారు.ప్రజలు కమ్యూనిటీ మధ్యవర్తిత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శాశ్వత లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్, ఎల్.ఎస్.యు.సి., ఎల్.ఎస్.యు.యం. తదితర న్యాయ సేవల గురించి వివరించారు.

నేడు జరగబోయే ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 8 పోలింగ్ కేంద్రాలకు 40 మంది సిబ్బంది ఏర్పాటు..

- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సిద్ధవటంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండు ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున మొత్తం 40 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఇప్పటికే మూడో విడత శిక్షణ అందించి, పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి కాన్వాయ్ రూట్ అధికారి ఆధ్వర్యంలో పోలీసు ఎస్కార్ట్‌తో ఎన్నికల సిబ్బందిని తరలించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో ఖాళీ బ్యాలెట్ బాక్సులను చూపించి, వారి సంతకాలు తీసుకున్న అనంతరం బాక్సులకు సీల్ వేసి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సీజ్ చేసి, కడపలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, తహసీల్దార్ విజయకుమార్, ఏవో సోమశేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార వృథాను అరికడదాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా పులివెందులలో అవగాహన కార్యక్రమం
ఆహారాన్ని వృథా చేయవద్దు -- ఎంవీఐ ప్రసాద్ పిలుపు



ప్రజాభూమి, పులివెందుల:
రాష్ట్ర రవాణా శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు నవంబర్ 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా బుధవారం పులివెందుల మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో సుస్థిర ఆహార వ్యవస్థలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ, ఆహారాన్ని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఆహార ఉత్పత్తికి నీరు, భూమి, విద్యుత్, రైతుల శ్రమ అవసరమని, ఆహారాన్ని వృథా చేయడం వల్ల సహజ వనరులు కూడా వృథా అవుతాయని వివరించారు.ప్రతి ఒక్కరూ స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు మరియు కాలానుగుణ ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒకసారి ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, నీటి సీసాలకు బదులుగా పునర్వినియోగ పాత్రలు, ఉక్కు నీటి సీసాలు ఉపయోగించాలని తెలిపారు.పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని, ఆహార వృథాను నివారించి భావితరాలకు సహజ వనరులను సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వాహన చోదకులు, వాహనదారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

- పోలింగ్ కేంద్రాల వద్ద 40 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు నేడు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్ధవటం ఎస్సై హరిక తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ రాజంపేట డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాలు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచనల మేరకు రెండు ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 40 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన అధికారిక ఏజెంట్లు మాత్రమే ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో అనవసరంగా ఎవరూ గుమిగూడకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిక హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యాసిన్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



ప్రజాభూమి, వేంపల్లె:
స్థానిక పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిఎన్ఎన్ఎఫ్ జిల్లా కార్యదర్శి యాసిన్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి యువనేత రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి యాసిన్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు కేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసిన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదగాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషిస్తూ మరింత గుర్తింపు పొందాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే), తెలంగాణ వల్లి, మహమ్మద్, రాహుల్, గంగాధర్ రెడ్డి, మారుతి, డక్కా రమేష్, శ్రీను, అహ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గోమాత మృతి

- మాధవరం--1 బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదం.. స్థానికుల్లో ఆవేదన



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామంలోని బస్టాండ్ వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో గుర్తుతెలియని లారీ గోమాతను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన గోమాత అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందిన గోమాత కళేబరాన్ని అక్కడి నుంచి తొలగించినట్లు సమాచారం. గ్రామంలోని బస్టాండ్ వద్ద జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. మూగజీవాల సంరక్షణపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి - మెరుగైన దిగుబడి

పంట కోతకు ముందే దిగుబడి అంచనా ప్రయోగం

ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం



ప్రజాభూమి,పులివెందుల:
ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో రైతు భరత్ కుమార్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి పంట పొలంలో దిగుబడి అంచనా ప్రయోగాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 5 గుణకారం 5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేపట్టగా, 19.39 కిలోల ధాన్యం దిగుబడి నమోదైంది. ఈ దిగుబడి ఆధారంగా ఎకరాకు సుమారు 40 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈ ప్రయోగం ద్వారా పంట కోతకు సుమారు పది రోజుల ముందుగానే ఎకరాకు వచ్చే దిగుబడి, ధాన్యం బస్తాల సంఖ్య, సాగుకు పెట్టిన పెట్టుబడి, చేసిన ఖర్చులను అంచనా వేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా రైతులు పంట దిగుబడి, సాగు వ్యయాలు, ఆశించిన ఆదాయంపై ముందస్తు అవగాహన పొందవచ్చు.అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటకు, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగంతో సాగు చేసిన పంటకు మధ్య దిగుబడి, పెట్టుబడి ఖర్చుల వ్యత్యాసాలను విశ్లేషించేందుకు ఈ ప్రయోగం దోహదపడుతుంది.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని, తక్కువ వ్యయంతో నాణ్యమైన పంటలను పండించవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధార పడకుండా ప్రకృతి సిద్ధమైన పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.ప్రతి రైతు పెట్టుబడి ఖర్చులను తగ్గించు కునే దిశగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మరింత మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్యాం సుందర్, గ్రామ సహాయకులు ఎస్. రామానుజుల రెడ్డి, శ్రావణి, రామాదేవి, హిమాంబి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత.. సహాయ పరికరాల వైద్య శిబిరం విజయవంతం

నమర్థన్ ట్రస్టు సౌజన్యంతో పులివెందులలో స్క్రీనింగ్ శిబిరం
అర్హులైన దివ్యాంగులకు త్వరలోనే ఉచితంగా ఉపకరణాలు -- డైరెక్టర్ లోకేష్



ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో సమర్థన్ ట్రస్టు సౌజన్యంతో దివ్యాం గుల సహాయ పరికరాల వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ముందుగా దివ్యాంగుల స్ఫూర్తి ప్రదాతలు లూయి బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రత్యేక పునరావాస నిపుణులు దివ్యాంగులను పరీక్షించి, సహాయ పరికరాలు అవసరమైన వారి పేర్లను నమోదు చేశారు.ఈ సందర్భంగా ట్రస్టు వైద్య విభాగ డైరెక్టర్ లోకేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులు వైద్య సదుపాయం, సహాయ ఉపకరణాలు లేక ఇళ్లకే పరిమితమవుతున్నారని, వారిని గుర్తించి జనజీవన స్రవంతిలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. అర్హులకు త్వరలోనే ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు.పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాల దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు సమన్వయకర్తలు లోకేష్, పవిత్ర, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రం ఉపాధ్యాయులు సిస్టర్ కీర్తి, ఎస్తేరు, సుమిత్ర, వికలాంగుల సంఘ సభ్యులు చిన్న రామకోటి, శివాజీ, మహమ్మద్ రఫీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు-గురు స్వామి వెంకట్రామిరెడ్డి

దీక్షా నమయంలో నియమాలను భక్తిశ్రద్ధలతో పాటించాలి



ప్రజాభూమి,పులివెందుల
పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో వెలసిన అయ్యప్ప ఆలయంలో బుధవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం అన్నదాన కార్యక్రమం, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల లో భాగంగా స్వామివారికి గురు స్వామి వెంకటరామిరెడ్డి , ఆలయ ప్రధాన అర్చకులు పుష్పెంద్ర గౌతమ్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం ధ్వనించింది. ఈ సందర్భంగా గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ దీక్షా సమయంలో కఠినమైన నియమాలను భక్తిశ్రద్ధలతో , నిబద్ధతతో ఆచరించడం ద్వారానే స్వామి వారి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి అనేకమంది మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్త జనానికి మధ్యాహ్న భోజనం, రాత్రికి అల్పాహార ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

గురువారం 05 నవంబరు 2026

స్థానిక ఎన్నికల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎన్నికల ఆర్ ఓ కి వినతి పత్రం అందజేత



ప్రజా భూమి ప్రతినిధి
రేణిగుంట.

రేణిగుంట మండలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారి ఆర్ఓకి సిపిఎం పార్టీ వినతి పత్రం అందజేశారు. ఓటర్లు తమ ఓట్లను ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా ఓటు హక్కు ఉపయోగించుకునే హక్కు ప్రజలకు ఉందని సిపిఎం పార్టీ సిఐటి మండల కన్వీనర్ సెలవరాజు అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ మండల కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓటు వేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది అలా ఎన్నిక లోపాల్గొని ప్రతి ఓటర్కి భంగం కలిగించేటువంటి అనైతిక చర్యలు పాల్పడ్డ వారిపై ఎన్నికల అధికారులు పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండి ఓటర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కుప్ప స్వామి మాట్లాడుతూ రేణిగుంట మండలంలో ఎన్నడను చూడని విధంగా నామినేషన్ల ప్రక్రియలో రౌడీయిజాలు గుండాయిజాలు చూసాం అలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా రక్షణ శాఖ ఎన్నికల శాఖప్రజలకు భద్రతా కల్పించాలని సిపిఎం పార్టీ వినితిపత్రం అందించింది.

మున్సిపల్/కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభంజనం: దండి నరేంద్ర

– జనసేన--టీడీపీ--బీజేపీ ఐక్యతకు ప్రజల ఘనమైన ఆమోదం
– అభివృద్ధి -సంక్షేమానికి మరో బలమైన ముందడుగు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన ఘనవిజయం పట్ల జనసేన పార్టీ నాయకులు, శ్రీ కాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి, అఖండ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ఇచ్చిన మద్దతుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వం సమన్వయంతో సాగుతున్న జనసేన--టీడీపీ--బీజేపీ ట్రిపుల్ ఇంజిన్ కూటమి రాష్ట్ర అభివృద్ధికి మరింత వేగాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే కూటమి లక్ష్యమని పేర్కొంటూ, విజయం సాధించిన అభ్యర్థులందరికీ మరోమారు అభినందనలు తెలియచేశారు.

ఎన్ సి సి అంటే ఐక్యత క్రమశిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

ఎన్. సి .సి అంటే దేశభక్తి, ఐక్యత మరియు క్రమశిక్షణ అని, ఎన్సిసి ద్వారా యువత మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని ఎన్సిసి అధికారి డాక్టర్ డి.భాస్కర్ అన్నారు. బుధవారం ఎస్. వి. ఏ. ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తిలో ఎన్. సి. సి.క్యాడెట్ లకు శిక్షణ మరియు డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల ఎన్సిసి అధికారి డాక్టర్ డి.భాస్కర్ మాట్లాడుతూ ఎన్సిసి ద్వారా బాధ్యత గల పౌరులుగా, దేశానికి ఉపయోగపడే ఉత్తమ నాయకులుగా తయారవుతారని తెలిపారు. ఎన్ సి సి క్యాడట్ లు క్రమశిక్షణతో మెలిగి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.. ఈ సందర్భంగా డిగ్రీలో చేరినటువంటి నూతన విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి ఎంపికైన వారికి ఎన్సీసీలో ప్రవేశం కల్పించారు. ఎన్సిసి వల్ల క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, సేవా భావం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలు తదితర లక్షణాలు అలవాడతాయని ఇతర వక్తలు అన్నారు.. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని 29 బెటాలియన్ కు సంబంధించిన ఎన్సిసి అధికారులు మురళి, మధు మరియు కళాశాల ఎన్సిసి క్యాడట్ లు హాజరయ్యారు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి డిగ్రీ కళాశాల మైదానం , పానగల్ మార్కెట్ యార్డ్‌కు తరలించేలా చర్యలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణాల ఏర్పాటుపై శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాశ్ రెడ్డి స్పందించారు.ఆయన మాట్లాడుతూ ఎవరి అనుమతితో ఇక్కడ టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు అంటు యజమానులను ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం టపాకాయల దుకాణాలను అయ్యల నాయుడు చెరువు వద్ద ఏర్పాటు చేసేవారని, అయితే పలు పత్రికలలో వచ్చిన కథనాలను దృష్టిలో పెట్టుకుని, ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఈసారి రెండు ప్రదేశాలను పరిశీలించినట్లు తెలిపారు. వాటిలో శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం,పానగల్ మార్కెట్ ఈ రెండు ప్రదేశాలను దుకాణదారులకు సూచించినట్లు ఆర్డీవో తెలియజేశారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, టపాకాయల దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



శ్రీకాళహస్తిలో గిరిజనులకు న్యాయ హక్కులపై అవగాహన

-లోబావి గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీ, విజ్ఞాన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న న్యాయ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాళహస్తిలోని లోబావి గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీ, న్యాయ విజ్ఞాన సదస్సును ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్, శ్రీరామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంత ప్రజలకు వివిధ చట్టాలు, ప్రాథమిక న్యాయ హక్కులపై అవగాహన కల్పించారు. నిరుపేదలకు న్యాయస్థానాల ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కోర్టు ద్వారా నియమితులైన పారా లీగల్ వాలంటీర్ల దృష్టికి తీసుకువస్తే, వాటిని సంబంధిత న్యాయ సేవా అధికార సంస్థల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ.... సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉంటే నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, విద్యాసంస్థల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని తెలిపారు. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు తదితర సమస్యలతో బాధపడేవారు న్యాయ సేవా అధికార సంస్థలను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. క్షణికావేశంలో కేసులు సమోదు చేసుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవాలనుకునే వారు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీ లు, స్థానిక ప్రజలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

నేడు పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు : డీయస్పీ జగదీష్ నాయక్





ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

స్థానిక యంపిటీసి, జడ్పిటీసి ఎన్నికలలో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చంద్రగిరి డీయస్పీ జగదీష్ నాయక్ పిలుపునిచ్చారు. రామచంద్రాపురం మండల కేంద్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై పోలీసులకు డీయస్పీ పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 పోలింగ్ కేంద్రాలలో జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కు 110 మంది పోలీసులు,2 ప్లైకింగ్ ఫోర్స్, ఒక ప్రత్యేక ప్లైకింగ్ ఫోర్స్, ప్రత్యేక పోలీసు బలగాలును వినియోగిస్తున్నట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుందని, ఎవరు కూడా గుంపులుగా చేరకూడదని తెలిపారు. ఇప్పటికే ట్రబుల్ మాంగర్స్ ని గుర్తించి నోటీసులు ఇచ్చామని చెప్పారు.ఎవరైనా ఎన్నికల నిర్వహణకు విఘాతం కలిగిస్తే బియన్ యస్ 137 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణ అధికారిణి వసంత భాయ్ మాట్లాడుతూ మండలంలో ఎన్నికల నిర్వహణకు 171 మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొంటున్నారని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్,కెమెరామెన్లు, వీడియో గ్రాఫర్లు 41 మందితో గురువారం ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారిణి తెలిపారు. నిబంధనలను ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలని,ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పై భక్తవత్సలం హెచ్చరించారు.

పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం -ఉదయం 7 నుంచి పోలింగ్

24జెడ్పీటీసీ, 300 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5 గురువారం నిర్వహించనున్న ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టారు. పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి అవసరమైన సూచనలు, బాధ్యతలను ఇప్పటికే తెలియజేశారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా తదితర ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సంయుక్తంగా ఓ ప్రకటనలో తెలిపారు

- జడ్పీటీసీ స్థానాలు: 27
- ఏకగ్రీవమైన జడ్పీటీసీ స్థానాలు: 3
- పోలింగ్ నిర్వహించే జడ్పీటీసీ స్థానాలు: 24
- జడ్పీటీసీ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు: 89
- ఎంపీటీసీ స్థానాలు: 370
- ఏకగ్రీవమైన ఎంపీటీసీ స్థానాలు: 70
- పోలింగ్ నిర్వహించే ఎంపీటీసీ స్థానాలు: 300
- ఎంపీటీసీ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు: 702

ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు:

- మొత్తం ఓటర్లు: 10,26,821
- పురుషులు: 5,07,703
- మహిళలు: 5,19,091
- ఇతరులు: 27
- గుర్తించిన పోలింగ్ కేంద్రాలు: 1,138
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు: 306
- అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు: 321
- వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించిన పోలింగ్ కేంద్రాలు: 228

ఎన్నికల సిబ్బంది, ఏర్పాట్లు:

రిటర్నింగ్ అధికారులు : 27
- సహాయ రిటర్నింగ్ అధికారులు : 54
- ప్రిసైడింగ్ అధికారులు (గ్రూం): 1,366
- ఇతర పోలింగ్ సిబ్బంది: 6,828
- జోనల్ అధికారులు: 105
- మైక్రో అబ్జర్వర్లు: 257
- ఎన్నికల విధులకు కేటాయించిన మొత్తం వాహనాలు: 234
- పెద్ద వాహనాలు: 141
- చిన్న వాహనాలు: 93
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు: 27
- పోలింగ్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉంది.
- ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయింది.
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు:

- కౌంటింగ్ కేంద్రాలు: 7
- కౌంటింగ్ టేబుళ్లు: 398
- కౌంటింగ్ సూపర్వైజర్లు (రిజర్వుతో కలిపి): 480
- కౌంటింగ్ సిబ్బంది (రిజర్వుతో కలిపి): 957

పోలీసు భద్రతా ఏర్పాట్లు:

ఎన్నికల విధుల కోసం మొత్తం 1,618 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. వీరిలో 6 మంది డీఎస్పీలు, 28 మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, 351 మంది కానిస్టేబుళ్లు, 1,185 మంది ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ బృందాలు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

బ్యాలెట్ గుర్తుల కేటాయింపుపై వివాదం.. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం అభ్యర్థి ఆందోళన!

తొలుత ప్రకటించిన క్రమసంఖ్యను మార్చారంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ గుర్తుల కేటాయింపు వ్యవహారం వివాదానికి దారితీసింది. గుర్తుల క్రమసంఖ్యలో మార్పులు చేశారంటూ నిర్పాక్ కోట ఎంపీటీసీ స్థానానికి సీపీఎం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్. రమణయ్య బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తన మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ.గత నెల 27వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సీపీఎం అభ్యర్థిగా తన పేరును మొదటి వరుసలో, క్రమసంఖ్య 1గా ప్రదర్శించారని తెలిపారు. బ్యాలెట్ పేపర్లో కూడా ఇదే క్రమం ఉంటుందని అధికారులు చెప్పడంతో తాము మొదటి నంబరుతో ఎన్నికల ప్రచార కరపత్రాలు ముద్రించి, ప్రచారం నిర్వహించామని పేర్కొన్నారు. అయితే బుధవారం ఉదయం కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా, గతంలో మొదటి స్థానంలో ఉన్న సీపీఎం గుర్తును రెండో స్థానానికి మార్చి, టీడీపీ గుర్తును మొదటి స్థానంలో ఉంచినట్లు గుర్తించానని ఆరోపించారు. ముందుగా ప్రకటించిన క్రమసంఖ్యను మార్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, గుర్తుల కేటాయింపులో జరిగిన మార్పులపై సమగ్ర విచారణ జరపాలని రమణయ్య కోరారు. తనకు తొలుత ప్రకటించిన క్రమసంఖ్యనే కొనసాగించాలని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల పర్యవేక్షణకు పోలీసుల రూట్ వెహికిల్ సిద్ధం!

మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల సందర్శనకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు



ప్రజా భూమి ప్రతినిధి: వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని వివిధ పోలింగ్ బూత్‌లను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక రూట్ వెహికిల్‌ను సిద్ధం చేశారు. వరదయ్యపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఎన్నికల విధుల కోసం ప్రత్యేక వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ఇందులో భాగంగా వాహనానికి డీజిల్ నింపించి, ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతర పర్యవేక్షణకు వీలుగా సిద్ధంగా ఉంచారు. ఎన్నికల సమయంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించడం ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించడం, శాంతిభద్రతలను పర్యవేక్షించడం ఈ రూట్ వెహికిల్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భద్రతా చర్యలు చేపట్టారు

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
గురువారం 05 నవంబరు 2026

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి

ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు: జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు





ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,
జిల్లాలో గురువారం నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతవైన వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మరియు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సంయుక్తంగా తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక ఎస్.జి.ఎస్. ఆర్ట్స్ కాలేజ్ నందు ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యుషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా ఎస్.పి. ఎల్.సుబ్బరాయుడుతో కలసి పరిశీలించి ఎన్నికల విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లా వ్యాప్తంగా 35 మండలాల్లో 35 జెడ్పీటీసీ స్థానాలకు గాను 4 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని మరియు 444 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 142 స్థానాలు ఏకగ్రీవం కాగా మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో సుమారు 11,70,397 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. జిల్లాలో మొత్తం 712 పోలింగ్ స్టేషన్ లొకేషన్ల పరిధిలో 1,505 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 760 పోలింగ్ స్టేషన్లను సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించి వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసామని, మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను వీడియో రికార్డింగ్ ద్వారా పర్యవేక్షించనున్నమన్నారు. జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా మైక్రో ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల సున్నితత్వాన్ని బట్టి ప్రత్యేక స్ట్రైకింగ్ టీమ్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశామని, బాలింతలు, గర్భిణీలు, వృద్ధులు, దివ్యాంగులు త్వరగా ఓటు వేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు, ఓటరు స్లిప్పు లేనివారు ఎన్నికల సంఘం నిర్దేశించిన 22 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గతంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల తరహాలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా అత్యంత ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు కల్పించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణకు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచామన్నారు. సమస్యాత్మక మండలాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను ప్రత్యేకంగా విధుల్లో నియమించినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రతి ఓటరు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్.డి.ఓ రాంమోహన్, జడ్.పి డివ్యూటీ సి.ఈ.ఓ రమణప్రసాద్, డ్వామా ఎ.పి.డి. ప్రభావతి, తిరుపతి రూరల్ తహశీల్దార్ జనార్ధన్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కిలివేటి సంజీవన్నా.. నువ్వు అదరగొట్టావ్

- నాయుడుపేటలో చైర్ పర్సన్ రాజేశ్వరమ్మ విజయంపై కిలివేటి సంజీవయ్యకు వైయస్ జగన్ ప్రత్యేక అభినందనలు..
- ఫోన్‌లో ఆప్యాయంగా పలకరించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.
- పార్టీ గెలుపు కోసం నాయకులు చేసిన కృషిపై మాజీ సీఎం జగన్ ప్రశంసలు.

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట
నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాధించిన చైర్ పర్సన్ పీఠం,13 మంది కౌన్సిలర్లు విజయంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.ఈ విజయంలో కీలకంగా వ్యవహరించిన సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు.పార్టీ కోసం ఆయన చేసిన కృషిని ప్రశంసిస్తూ ఆప్యాయంగా పలకరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం స్వయంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోన్‌లో సంజీవయ్యతో ఆప్యాయంగా మాట్లాడుతూ సంజీవన్నా..ఎలా ఉన్నావ్...మున్సిపల్ ఎన్నికలు ఎలా జరిగాయి అంటూ ఆప్యాయంగా పలకరించారు..అనంతరం నాయుడుపేటలో వైకాపా పార్టీ సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ "అదరగొట్టావ్"



అంటూ సంజీవయ్యను అభినందించారు. ఎన్నికల్లో ఆయన చూపిన చొరవ, పట్టుదల, నాయకత్వం, పార్టీ శ్రేణులను సమన్వయం చేసిన తీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్‌గా వైఎస్సార్‌సీపీ బలపరిచిన తంబిరెడ్డి రాజేశ్వరమ్మ 1187 ఓట్ల విజయం సాధించడంలో సంజీవయ్య ప్రత్యేకంగా కీలక పాత్ర పోషించారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటబెట్టుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేశారు. రాజకీయ ఒత్తిళ్లు,ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగారు. స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేస్తూ, కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ ఎన్నికల పోరులో క్రియాశీలకంగా వ్యవహరించారు.

-నీ కష్టానికి గుర్తింపు ఉంటుంది..పార్టీ అండగా ఉంటుంది మాజీ సీఎం జగన్.

పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ తన అండదండలు ఉంటాయని జగన్ భరోసా ఇచ్చారు. భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకుల శ్రమను గుర్తిస్తామని, వారి కృషికి తగిన గుర్తింపు ఉంటుందనే భరోసాను అధినేత అందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.గెలుపు సంబరం.. అధినేత అభినందన.

ఒకవైపు నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయం.. మరోవైపు పార్టీ అధినేత స్వయంగా ఫోన్ చేసి "సంజీవన్నా.. నువ్వు అదరగొట్టావ్" అంటూ అభినందించడం కిలివేటి సంజీవయ్యకు రాజకీయంగా ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. పార్టీ కష్టకాలంలోనూ,ఎన్నికల సమయంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచి పనిచేసిన నాయకత్వానికి అధినేత నుంచి లభించిన ప్రశంసగా ఈ పరిణామాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి. జగన్ ఆప్యాయ పలకరింపుతో సంజీవయ్య అనుచరులు, పార్టీ కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. స్వయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్ చేయడం సంజీవయ్యతో మాట్లాడడంతో వైఎస్ఆర్సిపి శ్రేణులు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎన్నికల విధుల్లో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

అలసత్వానికి తావులేకుండా ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి -- శ్రీకాళహస్తి డీఎస్పీ బి. పావని

-పోలీస్ అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం.. ఎన్నికల భద్రతపై ప్రత్యేక సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఎస్పీ బి. పావని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని ఆదేశించారు.

ఈ నందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఎస్పీ

బి. పావని మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు అతీతంగా చట్టం పరిధిలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని డీఎస్పీ పావని సూచించారు. ఈ సమావేశంలో బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు, ఎన్నికల విధులకు నియమితులైన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నాయుడుపేటలో వైసీపీ రాజకీయ ప్రభంజనం... మున్సిపల్ పీఠంపై రాజేశ్వరమ్మ విజయకేతనం...!

1,187 ఓట్ల భారీ మెజారిటీతో ప్రత్యర్థికి చుక్కలు చూపించిన వైసీపీ... ప్రజా తీర్పుతో టీడీపీకి గట్టి షాక్....!

ప్రజా భూమి ప్రతినిధి
నాయుడుపేట...

నాయుడుపేట మున్సిపల్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుని పట్టణ రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని ఘనంగా చాటుకుంది. వైసీపీ అభ్యర్థి తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి షేక్ షకీరాపై 1,187 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయాన్ని సాధించి ప్రత్యర్థి శిబిరానికి గట్టి రాజకీయ షాక్ ఇచ్చారు. ఈ విజయం కేవలం ఒక ఎన్నికల గెలుపు మాత్రమే కాదు... నాయుడుపేట ప్రజలు ఇచ్చిన స్పష్టమైన రాజకీయ తీర్పుగా వైసీపీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి. ఎన్నికల బరిలో వైసీపీ అభ్యర్థికి ప్రజలు అందించిన అపూర్వ మద్దతు, ప్రత్యర్థిపై సాధించిన భారీ ఆధిక్యం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

1,187 ఓట్ల మెజారిటీ... వైసీపీ విజయానికి తిరుగులేని నిదర్శనం...!

ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సాగించిన కృషి, ప్రజలతో మమేకమై నిర్వహించిన ప్రచారం విజయానికి బాటలు వేసింది. ఓటర్ల మద్దతుతో తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ భారీ మెజారిటీ సాధించడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీ గట్టి పోటీ ఇస్తుందని భావించినప్పటికీ, ప్రజా తీర్పు వైసీపీకి స్పష్టమైన ఆధిక్యాన్ని అందించింది.

నాయుడుపేట రాజకీయాల్లో వైసీపీ నత్తా చాటిన విజయం....!

మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో నాయుడుపేటలో వైసీపీ రాజకీయ బలం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఈ గెలుపు పార్టీ నాయకులు, కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని అందించడమే కాకుండా, భవిష్యత్తు రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేసింది. పట్టణ ప్రజల మద్దతుతో సాధించిన ఈ విజయాన్ని వైసీపీ శ్రేణులు ఘనంగా జరుపుకుంటున్నాయి.

ప్రజల ఆశలు... అభివృద్ధే లక్ష్యంగా కొత్త పాలన...!



తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ విజయంతో నాయుడుపేట పట్టణ అభివృద్ధిపై ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. పట్టణంలోని తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణ ప్రజలు ఆకాంక్షి స్తున్నారు. ప్రజలు అందించిన ఈ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి, పట్టణ అభివృద్ధికి కృషి చేయడం కొత్త చైర్‌పర్సన్ ముందున్న ప్రధాన కర్తవ్యంగా నిలవనుంది.

వైసీపీ శ్రేణుల్లో విజయోత్సాహం... ప్రత్యర్థి శిబిరంలో రాజకీయ చర్చ...!

తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ అఖండ విజయం సాధించడంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 1,187 ఓట్ల భారీ మెజారిటీతో సాధించిన ఈ గెలుపు నాయుడుపేట మున్సిపల్ రాజకీయాల్లో వైసీపీకి బలమైన విజయంగా నిలిచింది.

ప్రజా తీర్పు వైసీపీకి అనుకూలం... మున్సిపల్ పీఠం వైసీపీ సొంతం... నాయుడుపేటలో రాజేశ్వరమ్మ విజయప్రభంజనం!

విజయం వైసీపీది... మెజారిటీ ప్రజలది... నాయుడుపేట అభివృద్ధిపై ఆశలు మరింత బలమైనవి!.

వయ్యవూరు వరదయ్య ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
మండలంలోని చియ్యవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు 'వయ్యవూరు వరదయ్య' ఆకస్మికంగా స్వర్గస్తులవడంతో, వారి భౌతికకాయానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి వారి సతీమణి రిషిత రెడ్డి వారి భౌతికాయానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కు టుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడు తూ... వరదయ్య ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన బిడ్డల చదువు బాధ్యతను పూర్తిగా తాను తీసుకుంటానని హామీ ఇస్తూ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



మూడో వార్డులో నాగార్జున నామినేషన్ కాదు.. నేరుగా విజయ ప్రభంజనం!

టీడీపీపై భారీ మెజారిటీతో అఖండ విజయం....!

మూడో వార్డులో వైఎస్సార్‌సీపీ జైత్రయాత్ర..

పాలేటి నాగార్జునకు ప్రజల పట్టాభిషేకం....!

టీడీపీకి గట్టి షాక్.. మూడో వార్డులో

పాలేటి నాగార్జునకు తిరుగులేని విజయం....!

మూడో వార్డులో నాగార్జున హవా..

భారీ మెజారిటీతో ప్రత్యర్థిపై ఘన విజయం...!

ప్రజా తీర్పులో నాగార్జునకు జైజైలు..

మూడో వార్డులో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి...!



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట...

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో మూడో వార్డు రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలేటి నాగార్జున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిపై అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించి తన రాజకీయ సత్తాను చాటుకున్నారు. ఈ విజయం మూడో వార్డులో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది. ఎన్నికల బరిలో ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ, ఓటర్ల విశ్వాసాన్ని చూరగొన్న పాలేటి నాగార్జునకు ప్రజలు భారీ విజయాన్ని అందించారు. ఈ విజయంతో మూడో వార్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. విజయాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు భారీగా పాల్గొనగా ఘనమైన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయజయధ్వానాలు, నినాదాలతో వార్డు పరిసరాలు మార్మోగాయి. పార్టీ శ్రేణులు నాగార్జునకు ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాలేటి నాగార్జున మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన మూడో వార్డు ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ఈ విజయం తన ఒక్కడిదే కాదని, తనను నమ్మి ఆదరించిన ప్రతి ఓటరుది, తన కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మూడో వార్డు ప్రజల తీర్పు స్పష్టం చేసింది.. పాలేటి నాగార్జునకు అఖండ విజయాన్ని అందించి వైఎస్సార్‌సీపీ జెండాను విజయగర్వంతో ఎగురవేసింది.



ప్రజాభూమి

జనరల్ 10

గురువారం 05 నవంబరు 2026

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ

-కౌంటింగ్‌లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులు-సీసీ కెమెరాల దృశ్యాలు, బ్యాలెట్ స్లిప్పులు బయటపెట్టాలి -ధైర్యం ఉంటే రీకౌంటింగ్‌కు సిద్ధమా... -అధికార పార్టీకి వైఎస్సార్‌సీపీ నేతల సవాల్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నియంతృత్వాన్ని ప్రదర్శించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, తమ పార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కౌంటింగ్ కేంద్రంలోని సీసీ కెమెరాల దృశ్యాలు, బ్యాలెట్ స్లిప్పులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అధికార దర్పం ప్రదర్శించడం కాదు, నిజంగా ధైర్యం ఉంటే రీకౌంటింగ్‌కు సిద్ధం కావాలని అధికార పార్టీకి సవాల్ విసిరారు. ఫుటేజ్, సంబంధిత రికార్డులు అందించని పక్షంలో న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. బుధవారం హిందూపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ముఖ్య నేత వేణురెడ్డి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షాజియా, నాయకులు బాలాజీ, మనోహర్ తదితరులు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల కౌంటింగ్‌పై తమ అభ్యంతరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా షాజియా మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం అనేది పుస్తకాల్లో, పత్రికల్లో, మీడియాలో, ప్రసంగాల్లో మాత్రమే కనిపిస్తోందని, క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పార్టీ నియంతృత్వ ధోరణిని ప్రదర్శించిందని విమర్శించారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు వరకు తమ పార్టీ అభ్యర్థులు, నాయకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. నామినేషన్లను అడ్డుకోవడం, అభ్యర్థులను బెదిరించడం, డబ్బు ఆశ చూపించడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో తమ పార్టీ సీనియర్ నాయకులపై దాడులు జరిగినట్లు కూడా ఆరోపించారు. కౌంటింగ్ కేంద్రంలోనూ ప్రతిపక్ష అభ్యర్థులకు ఒక నిబంధన, అధికార పార్టీకి మరో నిబంధన అమలు చేశారని షాజియా విమర్శించారు. తమ పార్టీ ఏజెంట్లు, అభ్యర్థులను బయటకు పంపిస్తూ అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు మాత్రం లోపల ఉండే అవకాశం కల్పించారని ఆరోపించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శుల జోక్యం ఉందని, కౌంటింగ్ కేంద్రంలో అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు విమర్శించారు. తమ అభ్యర్థులు రీకౌంటింగ్ కోరినప్పుడు అవకాశం కల్పించకుండా, అధికార పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 29వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగరాజు భార్య రావిళ్ల లక్ష్మి పోటీ చేయగా, వైఎస్సార్‌సీపీ తరఫున గంగిరెడ్డి బరిలో నిలిచారని వేణురెడ్డి తెలిపారు. ఈ వార్డులో తమ పార్టీ అభ్యర్థి గంగిరెడ్డి విజయం సాధించారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి బ్యాలెట్ పత్రాలను లెక్కించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఓటర్లు ఓటు వేసిన అనంతరం సంతకాలు చేసిన స్లిప్పులతో పాటు సంబంధిత రికార్డులను పరిశీలించి రీకౌంటింగ్ నిర్వహించాలని కోరారు. అందులో రావిళ్ల లక్ష్మి గెలిచినట్లు నిరూపితమైతే తాను రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. తమ అభ్యర్థి కోరినప్పుడు మాత్రం రీకౌంటింగ్‌కు అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రంలోని అన్ని గదుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను తమకు అందించాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్న అధికారులు ఆ దృశ్యాలను బహిర్గతం చేయాలని కోరారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో పాటు బ్యాలెట్ స్లిప్పులు, కౌంటింగ్‌కు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. ఫుటేజ్ ఇవ్వని పక్షంలో మరుసటి రోజే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో తమకు అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు షాజియా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తమ అభ్యర్థుల కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు చూపిన ఆదరణ, నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, నాయకులు శివశంకర్ రెడ్డి, రామ్మూర్తి తదితరులతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజలకు డిప్యూటీ మేయర్ స్థానాన్ని కేటాయించండి

– ఎన్డీఏ నేతలను కోరిన రాయలసీమ బలిజ మహా సంఘం నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి,అనంతపురం:

అనంతపురం కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికలలో బలిజలకు డిప్యూటీ మేయర్ స్థానాన్ని కేటాయించాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షులు మున్నా నగర్ శంకరయ్య ఎన్ డి ఏ నాయకులు ను కోరారు. బుధవారం అనంతపురం నగరంలోని బాలాజీ ప్రార్థన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు బళ్లారి వెంకట్రాముడుతో కలిసి ఆయన మాట్లాడుతూ మేయర్ స్థానాన్ని జనరల్ గా నిర్ణయించినప్పుడు బలిజలకు కేటాయించాలని కోరగా అనూహ్యంగా మేయర్ స్థానం బీసీలకు కేటాయింపులు జరిగాయని దాని పరంగా బలిజలు మేయర్ స్థానాన్ని వదులుకోవాల్సి వచ్చిందని కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికలలో బలిజలు ఘన విజయాన్ని సాధించారని అందులో భాగంగా బలిజలకు అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ స్థానాన్ని ఇవ్వాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లను కోరారు ఈ కార్యక్రమంలో కోశాధికారి కోనేటి సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శి పున్నం విజయభాస్కర్, గౌరవ సలహాదారు జీవి రమణ ,ఉపాధ్యక్షులు నగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజేతలకు ఘన సన్మానం

-వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణురెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లకు పార్టీ నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నియోజకవర్గ ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దీపిక, వేణురెడ్డి మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ హిందూపురం మున్సిపాలిటీలోని 52 వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి ధైర్యంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజల కోసం నిరంతరం పోరాడే వైఎస్సార్‌సీపీకి ఓటమి అంటూ ఉండదని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికతో పాటు కౌన్సిలర్ ఎన్నికల్లోనూ ప్రజలు తమపై చూపినప్రేమాభిమానాలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. కష్టకాలంలోనూ పార్టీ అభ్యర్థులకు అండగానిలిచిన ప్రజలకు పాదాభివందనాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపాలిటీలో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ ఎన్నికల ఏర్పాట్లు ను పరిశీలించిన ఐపిఎస్ స్మరణ్ రాజ్ సమీక్షించారు

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం ఎంపీడీవో కార్యాలయంలో, మండల రిటర్నింగ్ అధికారి (ఆరో), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఏఆర్ ఓ, తహసీల్దార్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల సంసిద్ధత, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో. పారదర్శకంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

బాలయ్య పిఏలకు సన్మానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కూటమి పార్టీలకు చెందిన కౌన్సిలర్లు బుధవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఏలు డాక్టర్ సురేంద్ర, పావులూరి శ్రీనివాసరావు, బాలాజీ లను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు బాధ్యతాయుతంగా పనిచేసే ప్రజాసేవకు పాటుపడాలని సూచించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ప్రజల్లో మెప్పు పొందాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కూడా కౌన్సిలర్లు కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కూటమి పార్టీల చెందిన కొత్త కౌన్సిలర్లు వారిని కలిసి అభినందనలు తెలిపారు.

పుట్లూరు మండలంలో ప్రశాంత వాతావరణం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కీలక నిర్ణయం

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని, ప్రజలు, ఓటర్లు ప్రశాంతంగా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 మంది వీరాజ అభ్యర్థుల ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు.ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనల దృష్ట్యా, మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదని, ఓటర్లను దృష్టిలో పెట్టుకుని తమ ఎన్నికల కార్యక్రమాలను స్వచ్ఛందంగా తప్పుకోవాలని నిర్ణయించారు. మాకు పదవులు ముఖ్యం కాదు, ప్రజల ప్రశాంతత ముఖ్యం. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి, ఎలాంటి గొడవలు జరగకూడదు. పెద్దల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రజలే మా బలం, వారి తీర్పునకు మేము కట్టుబడి ఉంటాం" అని వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు కోరారు.

యల్లనూరు ప్రజా పరిషత్ కార్యాలయం చేరుకున్న పోలింగ్ సిబ్బంది...

పోలింగ్ సిబ్బందికి తప్పని తిప్పలు - ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్న పోలీసులు..!





ప్రజా భూమి యల్లనూరు

మండల వ్యాప్తంగా 10 ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు సంబంధించి స్థానిక ఎన్నికలు నవంబర్ 5 న జరుగనున్న నేపథ్యంలో అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా.. మండల వ్యాప్తంగా మహిళలు, పురుషుల యొక్క ఓటర్లను కలుపుకొని 29,200 ఉన్నట్లు తెలిపారు అదేవిధంగా పోలింగ్ స్టేషన్లు 44 జోన్లు 3 టీములు 7 బూత్ లు 44 గాను 1 బూత్ కు 5 మంది చొప్పున మొత్తం 220 ఉన్నట్లు వీరిలో పిఓ, ఏపీఓ,ఓపిఓ లకు ముందుగా సమావేశం ఏర్పాటు చేసుకొని దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి ఎలక్షన్ డ్యూటీ ఉన్నందున పురుషులు,మహిళా ఉద్యోగుల పరిస్థితి గమనిస్తే బాత్రూమ్ లు పరిశుభ్రంగా లేక పోవడం అందులో నీరు నరిగా రాకపోవడంతో మహిళా ఉద్యోగులు ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర అసౌకర్యంగా ఉన్నట్లు తెలుస్తుంది ఎంపీడీవో మనోహర్ బాబు వచ్చినటువంటి ఎన్నికల సిబ్బందికి కనీస సదుపాయాలు ఉన్నాయా లేదా అంటూ పట్టించుకోలేదని వచ్చిన సిబ్బంది గుసగుసలాడు కుంటున్నట్లు తెలుస్తోంది ఇది ఇలా జరిగిందనుకుంటే ఉదయం అల్పాహారంలో తీసుకుంటున్న సమయంలో కనీసం త్రాగటానికి సరిపడా వాటర్ క్యాన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ఎందుకురా దేవుడా అని విసుగెత్తి తలబాదు కుంటున్నారు మరి మధ్యాహ్నం అయితే స్కూల్ పిల్లల కంటే చాలా దారుణంగా రెండు చిన్న బాక్సుల్లో పులిహోర, పెరుగన్నం తక్కువ మోతాదులో ఇచ్చి సాటి ఉద్యోగులే కదా అని చూడకుండా చాలా దారుణంగా ప్రవర్తించిన తీరు పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది ప్రభుత్వం వారికి కేటాయించి డబ్బులు రోజు వారీగా ఖర్చు చేయాలి అది లేకుండా ఇలా కూడా సొమ్ము చేసుకోవడంలో ఫుడ్ మెయింటెనెన్స్ వారు ఇక్కడ అధిక ఖర్చులు చేశామని చూపడంలో ఘటులే అంటూ బహిరంగంగా చర్చించు కుంటున్నట్టు తెలుస్తుంది ఏదిఏమైనా ఎన్నికల సిబ్బంది ఎడమొహం పెడ మొహం వేసుకుని తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు తప్పదంటూ వెళ్లారు. ఈ స్థానిక ఎన్నికల బందోబస్తు పై ఎస్సై రామాంజనేయ రెడ్డి ని వివరణ కోరగా ఒక డిఎస్పి అధికారి ఇద్దరు సిఐలు ఇద్దరు ఎస్ఐలు మొత్తం 150 మంది 44 పోలీస్ స్టేషన్లో సంబంధించి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలకు ఓటర్లకు తెలియజేసేది మీ ఓటు హక్కు స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని అదే విధంగా గ్రామంలో ఎటువంటి ఘర్షణలకు పాల్పడిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు కావున మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపాలిటీల్లో ఉప చైర్మన్ల ఎన్నికకు షెడ్యూల్ విడుదల

-23న ప్రత్యేక సమావేశాలు

-ఈ నెల 18న ప్రత్యేక సమావేశానికి నోటీసులు జారీ

-రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని ఏడు మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్ల (ఉప చైర్మన్ల) ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మున్సిపాలిటీల చట్టం, 1965లోని 10-ఏ, 10-బి సెక్షన్లు, వైస్ చైర్మన్ ఎన్నికల నిబంధనలు--2026 ప్రకారం ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి మున్సిపాలిటీలతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ వర్తించనుంది. ఈ నెల 18వ తేదీన సంబంధిత కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు అధికారం కల్పించిన గెజిటెడ్ అధికారులు ప్రత్యేక సమావేశాల నిర్వహణకు నోటీసులు జారీ చేయనున్నారు. ఈ నోటీసులను మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులకు అందజేయనున్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉప చైర్మన్ల ఎన్నిక చేపట్టనున్నారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల నవంబర్ 23న ఎన్నిక నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే, మరుసటి రోజు నవంబర్ 24న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆ రోజు కూడా ఎన్నిక జరగని పక్షంలో తదుపరి తేదీని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించనుంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయా పట్టణాల్లో ఉప చైర్మన్ల ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకుని ఉప చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలు రచించే అవకాశం ఉంది.

సుస్థిర జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ఐసీడీఎస్ సూపర్వైజర్ డా. స్వర్ణలత



ప్రజాభూమి, వేంపల్లె

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనిస్తూ సుస్థిరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ డా. స్వర్ణలత సూచించారు. బుధవారం స్థానిక పట్టణంలోని కాపువీధి అంగన్వాడీ కేంద్రంలో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించడం, విద్యుత్‌ను ఆదా చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆహార వృథాను అరికట్టి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు

జడ్పీటీసీ ఎన్నికల వేళ మా నాయకులపై అక్రమ కేసులు-ఎంపీ అవినాష్ రెడ్డి ఆరోపణ

న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు.. లింగాల పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయింపు



ప్రజాభూమి, లింగాల

జడ్పీటీసీ ఎన్నికల సమయంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో బుధవారం లింగాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచారు. వారిపై నమోదైన కేసుల విషయంలో పోలీసులతో చర్చలు జరిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.2,00,000 విరాళం

హేమంత్ కుటుంబ సభ్యులు

ప్రజా భూమి ప్రతినిధి

శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం, సిరుగుప్పకు చెందిన హేమంత్ కాజా రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం ప్రోటోకాల్ ఏఈఓ పి. లోకేష్ బాబు కి అందజేశారు. ఈ సందర్భంగా విరాళదాతకు దేవస్థానం తరఫున స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు

ప్రజాభూమి
పోలవరం 11
గురువారం 5 నవంబరు 2026

ప్రశాంత వాతావరణంలో MPTC, ZPTC ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- 368 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు.. 100 శాతం పోలింగ్ ప్రక్రియ రికార్డింగ్
- ఎన్నికల విధుల్లో 2,500 మంది సిబ్బంది..
- 43 మారుమూల పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్.. మిగిలిన కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల వరకు
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జిల్లాలో మొత్తం 368 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని, మారుమూల ప్రాంతాల్లోని 44 పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు, మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమయాల వివరాలను ఇప్పటికే ప్రజలకు తెలియజేయడంతో పాటు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లోనూ పొందుపరిచినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి మండలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ సిబ్బందికి పకడ్బందీగా శిక్షణ అందించామని, ఇప్పటికే రెండు విడతల శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో సుమారు 2,500 మంది సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో బయలుదేరిన సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తారని, గురువారం ఉదయం 7 గంటలకల్లా ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని కేంద్రాలు సిద్ధంగా ఉంటాయని పేర్కొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో నిఘా.. మొత్తం ప్రక్రియ రికార్డింగ్

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా జిల్లాలోని మొత్తం 368 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ లేదా వీడియో రికార్డింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పూర్తిస్థాయిలో రికార్డు చేసే ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 100 శాతం పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన దృశ్యాలను భద్రపరచనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఇప్పటికే పలు ముందస్తు చర్యలు చేపట్టామని, నిఘా సమాచారం ఆధారంగా సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ నిర్వహించినట్లు వివరించారు.

ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

-పోలవరం జిల్లా ఎన్నికల అధికారి కే దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తమకు సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటరు గుర్తింపు కార్డు వివరాలను నమోదు చేయడం ద్వారా తమ పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో వెబ్ కాస్టింగ్ సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, మీడియా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాల భాగస్వాములు, సంబంధిత అధికారులు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

నవంబర్ 5 అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు సెలవు
జిల్లా ఎన్నికల అధికారి



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 5వ తేదీ గురువారం పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, బ్యాంకులకు స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఈ సెలవు ప్రకటన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణపై పటిష్ట నిఘా
-డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే అక్రమ మద్యం, నగదు తదితర అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య బ్యాలెట్ బాక్సుల తరలింపు



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మంగళవారం ఎన్నికల సందడి నెలకొంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు.

ఒకవైపు వర్షం కురుస్తున్నప్పటికీ పోలింగ్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించారు. వర్షం కారణంగా ఎన్నికల సామగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రిని ప్రత్యేక జాగ్రత్తలతో తరలించారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడమే తమ లక్ష్యమని సిబ్బంది పేర్కొన్నారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని సురక్షితంగా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధం చేశారు. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికల సామగ్రితో వాహనాలు పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లాయి.ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్దిష్ట సమయానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, మరుసటి రోజు జరిగే ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది సమాయత్తమయ్యారు.

1,100 మంది పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు,
స్టాటిక్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ల ఏర్పాటు

పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున సుమారు 1,100 మంది పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఏరియా డామినేషన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, రూట్ మొబైల్స్, స్టాటిక్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి వివరించారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించామని, సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే అక్రమ మద్యం, నగదు తదితర అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఒక పండుగ వంటివని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్నికల అక్రమాలు, ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలపై ప్రజలకు ఏదైనా సమాచారం ఉంటే పోలీసు శాఖకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచి, ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు, అధికారుల సమష్టి సహకారంతో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తిచేస్తామని కలెక్టర్, ఎస్పీ తెలిపారు.

ఏజెన్సీని అతలాకుతలం చేసిన అతి భారీ వర్షం!

- వాగులు, వంకలు ఉగ్రరూపం.. రహదారులపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వరద నీరు
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన వరి పంటలు - రైతులకు తీరని నష్టం
- పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి జనజీవనం స్తంభనం





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

రెండు రోజులుగా కురుస్తున్న గాలివానతో కూడిన అతి భారీ వర్షాలు ఏజెన్సీ ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. మండల కేంద్రంతో పాటు మండలానికి ఎగువ ప్రాంతాల్లోని కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన కుంభవృష్టి జనజీవనాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు దిగువకు చేరడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ఉగ్రరూపం దాల్చాయి. పలు గ్రామాల మధ్య ఉన్న రహదారులు, కల్వర్టులు, చప్టాలపై నుంచి వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు..
ప్రమాదకరంగా మారిన రహదారులు

మండలంలోని తుష్టివారిగూడెం-అడవి వెంకన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తూ చప్టాపై నుంచి వరద నీరు పారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. అదేవిధంగా అన్నవరం-ఉమ్మడివరం గ్రామాల మధ్య ఉన్న వాగు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. భారీగా చేరిన వరద నీరు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మొద్దులగూడెం గ్రామం వద్ద ఉన్న చెరువులోకి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దీంతో చెరువు పూర్తిగా నిండి పొంగిపొర్లింది. చెరువు నుంచి బయటకు వచ్చిన వరద నీరు మొద్దులగూడెం-సీతంపేట గ్రామాల మధ్య ఉన్న చప్టాపై నుంచి ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. తెల్లవారిగూడెం, కుంజవారిగూడెం తదితర గ్రామాల పరిసరాల్లోనూ భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వరద ప్రవాహం రహదారులపైకి చేరడంతో పలుచోట్ల రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. రహదారులు జలమయమయ్యాయి. కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం మరింత పెరగడంతో గ్రామాల మధ్య రాకపోకలు సాగించడం ప్రజలకు కష్టసాధ్యంగా మారింది.





వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునక.. రైతన్నలకు కన్నీళ్లే మిగులు

మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. లోతట్టు ప్రాంతాల్లో సాగు చేసిన వందలాది ఎకరాల వరి పంట వర్షపు నీటిలో మునిగిపోయింది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంట చేతికి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రకృతి ప్రకోపంతో రైతన్నల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. పంట నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రాని ప్రజలు

అకస్మాత్తుగా విరుచుకుపడిన భారీ వర్షాలు మండల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసర పనులు, వ్యవసాయ పనులు, ఇతర అత్యవసర కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. వర్షాల తీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయటకు రావడానికి సాహసించడం లేదు.

నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని బాధిత రైతులు కోరుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టుల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకర వాగుల వద్ద ముందస్తు హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తంగా రెండు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలు వి.ఆర్.పురం మండలంలో తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ఒకవైపు ఉప్పొంగుతున్న వాగులు, మరోవైపు నీట మునిగిన పంట పొలాలు, ఇంకోవైపు నిలిచిపోయిన రాకపోకలతో ఏజెన్సీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాలు, వరదల ప్రభావం నుంచి ఎప్పుడు బయటపడతామోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 670 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు!

383 మందిపై బైండోవర్ చర్యలు.. రూ.5.10 లక్షల నగదు, 133.7 లీటర్ల మద్యం స్వాధీనం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలవరం జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 670 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు బుధవారం వెల్లడించారు. జిల్లాలో 12 జడ్పీటీసీ, 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 368 పోలింగ్ లొకేషన్ల పరిధిలో 275 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 22 అత్యంత సమస్యాత్మక, 44 సమస్యాత్మక, 209 సాధారణ పోలింగ్ లొకేషన్లుగా గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

670 మంది పోలీసులతో బందోబస్తు

ఎన్నికల విధుల కోసం ముగ్గురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, 86 మంది ఏఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, 86 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు, 273 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఏఆర్ కానిస్టేబుళ్లు, 176 మంది హోంగార్డులను నియమించారు.

383 మందిపై బైండోవర్ చర్యలు

ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 383 మంది చెడు నడత కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లపై బైండోవర్ చర్యలు చేపట్టారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 71 కేసులు నమోదు చేశారు. అక్రమ మద్యం నియంత్రణ చర్యల్లో భాగంగా 133.7 లీటర్ల మద్యం, రూ.5,10,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా

పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలతో నిరంతర గస్తీ ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచడంతో పాటు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద



సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

పోలింగ్ ముగిసిన అనంతరం కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉన్నా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 9440900762కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.



ప్రజాభూమి

జనరల్

గురువారం, నవంబర్ 05, 2026

12

సర్వం సిద్ధం

❖ పోలింగ్ సామగ్రి పంపిణీ పూర్తి ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు ❖ వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు, బుడమేరు ప్రవాహ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన ❖ పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం ❖ జి.కొండూరు మండలంలో 16 సెక్టోరియల్ అధికారులు, 60 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు ❖ ఎన్నికల సిబ్బంది రవాణాకు 5 ప్రత్యేక రూట్లు, ప్రతి రూట్‌కు రెండు బస్సులు పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా పూర్తి



ప్రజాభూమి ప్రతినిధులు బృందం(విజయవాడ/జి.కొండూరు/గంపలగూడెం):

ఎన్టీఆర్ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని, పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయా లు కల్పించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విజయవాడ, జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, ఒకవైపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లను, మరోవైపు ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. పర్యటనలో భాగంగా జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జి.కొండూరు మండలంలో మొత్తం 16 సెక్టోరియల్ అధికారులు, 60 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల సామగ్రి తరలింపు, పోలింగ్ సిబ్బంది రవాణా కోసం ఐదు ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేశామని, ప్రతి రూట్‌కు రెండు బస్సుల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. రవాణా ఏర్పాట్లలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



❖ బుడమేరులో తగ్గిన నీటి ప్రవాహం ❖ డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ❖ ప్రస్తుతానికి ఎలాంటి వరద ముప్పు లేదు – ప్రజలు ఆందోళన చెందవద్దు... ❖ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

గురువారం పోలింగ్ నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నియమావళిని పూర్తిస్థాయిలో పాటిస్తూ, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఇంద్రకీలాద్రిపై శ్రీ భవానీ దీక్ష ఉత్సవములు–పూర్తి షెడ్యూల్



ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:

శ్రీ పరాభవ నామ సంవత్సర వార్షిక "శ్రీ భవానీ దీక్ష ఉత్సవములు – 2026" కార్యక్రమములున వంబర్ 20, 2026 శుక్రవారం నుండి జనవరి 03, 2027 ఆదివారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. భవానీ దీక్ష ఉత్సవములలో మండల దీక్షాధారణ ప్రారంభం 20 నవంబర్ 2026 (శుక్రవారం - కార్తిక శుద్ధ ఏకాదశి) ఉదయం 8:45 నిమిషాలకు. మండల దీక్షాధారణ సమాప్తి: 24 నవంబర్ 2026 (మంగళవారం - కార్తిక పూర్ణిమ). అర్ధమండల దీక్షాధారణ ప్రారంభం: 10 డిసెంబర్ 2026 (గురువారం). అర్ధమండల దీక్షాధారణ సమాప్తి: 14 డిసెంబర్ 2026 (సోమవారం). 'కలశ జ్యోతి' ఉత్సవము: 24 డిసెంబర్ 2026 (గురువారం - మార్గశిర పూర్ణిమ) సాయంత్రం 6:30 నిమిషాలకు సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరి శారదా పీఠం పరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) నుండి బయలుదేరి నగరకోత్సవముగా శ్రీ అమ్మవారి దేవస్థానమునకు చేరును. శ్రీ భవానీ మండల దీక్షా విరమణలు (30-12-2026 నుండి 03-01-2027 వరకు): 30 డిసెంబర్ 2026 (బుధవారం): ఉదయం 6:30 నిమిషాలకు అగ్నిప్రతిష్ఠాపన, శత చండీయాగం, 'గిరి ప్రదక్షిణ' ప్రారంభం. 03 జనవరి 2027 (ఆదివారం): ఉదయం 10:00 గంటలకు పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణలు సమాప్తమవుతాయి. భవానీ భక్తులకు క్యూలైన్లు, ప్రసాదం, కేశఖండన, స్నానఘట్టాలు మరియు విరమణ ఏర్పాట్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవో పేర్కొన్నారు. దీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం కొరకు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్: 1800 425 9099 ను సంప్రదించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా కార్తీక మాస ప్రత్యేక పూజలు

ఏర్పాట్ల వివరాలు వెల్లడించిన ఈవో శీనా నాయక్"



ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:

శ్రీ పరాభవ నామ సంవత్సర కార్తీక మాస పర్వదినా లను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మరియు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో వైదిక కమిటీ సూచనల మేరకు నవంబర్ 10 నుండి డిసెంబర్ 08వ తేదీ వరకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారివి.కె. శీనానాయక్ తెలిపారు. ముందుగా నవంబర్ 09వ తేదీ ప్రదోష కాలంలో శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం మరియు శ్రీ నటరాజ స్వామి వారి ఆలయాలలో శాస్త్రోక్తంగా "ఆకాశ దీపం" ఏర్పాటు చేయబడుతుంది. కార్తీక మాసమంతా ప్రతిరోజూ ఉదయం 6:00 నుండి 9:00 గంటల వరకు ప్రథమ కాల అభిషేకాలు, ఉదయం 8:00 నుండి 11:00 గంటల వరకు లక్ష్మీ గణపతి పంచాక్షరీ పఠనము మరియు కారక పారాయణములు, ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ద్వితీయ కాల అభిషేకాలు జరుగుతాయి. అలాగే మధ్యాహ్నం 3:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు తృతీయ కాల అభిషేకాలు, మధ్యాహ్నం 3:30 నుండి రాత్రి 7:00 గంటల వరకు ప్రత్యేక బిల్వార్చనలు, లక్ష బిల్వార్చనలు, సహస్ర లింగార్చనలు మరియు రాత్రి 7:00 గంటలకు ఊంజల్ సేవ (దీపోత్సవ ఆర్జిత సేవ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.నవంబర్ 13న నాగుల చవితి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున 4:00 గంటలకు అభిషేకము, సాయంత్రం 5:00 గంటలకు దీపోత్సవం జరుగును. అలాగే నవంబర్ 24న కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సాయంత్రం 6:30 గంటలకు "కోటి దీపోత్సవం", రాత్రి 7:00 గంటలకు శివాలయంలో "జ్వాలాతోరణం" అత్యంత వైభవంగా నిర్వహించబడును.భక్తుల సౌకర్యార్థం నవంబర్ 16 (కార్తీక శుద్ధ సప్తమి), నవంబర్ 20 (కార్తీక శుద్ధ ఏకాదశి), నవంబర్ 23 (కార్తీక శుద్ధ చతుర్దశి), నవంబర్ 24 (కార్తీక పౌర్ణమి), నవంబర్ 30 (కార్తీక బహుళ షష్ఠి), డిసెంబర్ 04 (కార్తీక బహుళ ఏకాదశి), డిసెంబర్ 07 (కార్తీక బహుళ చతుర్దశి - మాస శివరాత్రి) తేదీలలో మధ్యాహ్నం 3:30 నుండి రాత్రి 7:00 గంటల వరకు ప్రత్యేక బిల్వార్చన (ఆర్జిత సేవ), అనంతరం రాత్రి 7:00 గంటలకు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేయబడినది.

ఆర్జిత సేవా రుసుముల వివరాలు:సహస్ర లింగార్చన (నెల రోజులకు): రూ. 5,116/-ప్రత్యేక బిల్వార్చన (ఒక రోజుకు): రూ. 2,000/-నిత్య ఆర్జిత రుద్ర హోమము: రూ. 1,000/-సహస్ర లింగార్చన (ఒక రోజుకు): రూ. 500/-ఊంజల సేవ (దీపాలంకరణ - ఒక టికెట్‌పై ఒకరికి): రూ. 50/-భక్తులు విశేష సంఖ్యలో విచ్చేసి ఈ పవిత్ర పూజాదికాలలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ అమ్మవారు మరియు శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల కృపాకటాక్షాలు పొందగలరని ఈవో వి.కె. శీనానాయక్ కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వేంపల్లి సీఐ నరసింహులు తెలిపారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలో సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ చేపట్టి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా మొబైల్ పార్టీలు, స్టైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్ బృందాలను అప్రమత్తం చేసి విధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

❖ 26 మండలాల్లో 1,266 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ❖ 9,98,055 మంది ఓటర్లుఎన్నికల విధులకు 6,545 మంది సిబ్బంది ❖ 636 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, మిగిలిన కేంద్రాల్లో వెబ్ కెమెరాలతో నిరంతర రికార్డింగ్ ❖ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

కృష్ణా జిల్లాలో రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ తెలిపారు.జిల్లాలోని 26 మండలాల పరిధిలో 26 జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 74 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, వివిధ రాజకీయ పార్టీలైన తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, జనసేన పార్టీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. అదేవి ధంగా మొత్తం 352 ఎంపీటీసీ స్థానాలకు సంబం ధించి 9 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన స్థానా లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 774 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని పేర్కొన్నారు.

9,98,055 మంది ఓటర్లు

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మొత్తం 9,98,055 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో 4,84,809 మంది పురుషులు, 5,13,222 మంది మహిళలు, 24 మంది ఇతర ఓటర్లు ఉన్నారని వివరించారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

1,266 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 1,266 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో 401 సెన్సిటివ్, 230 హైపర్ సెన్సిటివ్, 5 యాక్సెస్‌కు ఇబ్బందిగా ఉన్న (Inaccessible) పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 636 పోలింగ్ కేంద్రా ల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలి పారు. మిగిలిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను నిరంతరం రికార్డు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడిం చారు. తద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి పరిణామాన్ని పర్యవేక్షించేందుకు వీలుంటుం దని తెలిపారు.



6,245 మంది ఎన్నికల సిబ్బంది నియామకం

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 26 మంది రిటర్నింగ్ అధికారులు (ROలు), 26 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (AROలు) నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. వీరితో పాటు పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించినట్లు వివరించారు.- ప్రిసైడింగ్ అధికారులు (POలు) – 1,266 మంది- అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (APOలు) – 1,266 మంది- ఇతర పోలింగ్ అధికారులు (OPOలు) – 3,713 మంది- మొత్తం ఎన్నికల సిబ్బంది – 6,245 మందిఎన్ని కల విధులకు నియమించిన అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించడంతో పాటు పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, భద్రత, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు.

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం

❖ అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతో అత్యుత్తమ విధాన రూపకల్పన ❖ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు ❖ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలన్న మంత్రి లోకేష్ ❖ సీఎంతో సమావేశమైన ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

విభిన్న రాష్ట్రాలు, భాషలు కలిగిన భారతదేశంలో అందరినీ కలుపుకొని వెళ్లేలా జాతీయ పరీక్షా సంస్కరణలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సూచించారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఏకాభి ప్రాయంతో పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాలని అన్నారు. దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే విద్యార్థికైనా సమాన అవకాశాలు, న్యాయం జరిగేలా సంస్క రణలు ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సచివాల యానికి వచ్చిన నందన్ నీలేకనికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా జరిగిన భేటీలో జాతీయ పరీక్షా విధానంపై టాస్క్ ఫోర్స్ కు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకుండా విద్యా ర్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం పెంపొందించేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దా లని అభిప్రాయపడ్డారు. ఈ సమావే శంలో పాల్గొన్న లోకేష్ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాలు, సాంకేతికత వినియోగాన్ని వివరించారు. అలాగే దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై తన ఆలోచనలను పంచుకున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గేలా పరీక్షల విధానాన్ని రూపొందించాలని లోకేష్ సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లి చదువుకోవాలన్నా, ఉద్యోగం చేయాలన్నా భాష, విద్యా విధానం, ధృవీకరణల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ స్థాయిలో సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో డేటా లేక్ ద్వారా వివిధ రంగాలకు సంబం ధించిన సమాచారాన్ని సమీకరించి, నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.



పరీక్షల విధానంలో సమూల మార్పుల దిశగా...

పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞా నాన్ని సమర్థంగా వినియోగించడం, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభా గాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తాము ప్రత్యేక దృష్టి సారించినట్లు టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని... ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు, ఎదురవుతున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలపై ఆసక్తి వ్యక్తం చేశారు.

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి
జనరల్ 13
గురువారం 5 నవంబర్ 2026

కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు ఘన విజయం





- వైకాపా అభ్యర్థి నాగేశ్వరరావుపై 7,840 ఓట్లు మెజారిటీతో విజయం
- 27 మంది కూటమి అభ్యర్థులతో మున్సిపాలిటీ కైవసం

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రాపురం మున్సిపాలిటీకి మంగళవారం నిర్వహించిన కౌంటింగ్లో టిడిపి మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు పట్టణంలో 32 వార్డులకు వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన 12 వార్డులో అభ్యర్థులందరూ బారీ విజయం సాధించడంతో జనసేన క్లీన్ స్వీప్ చేసింది.మొత్తం మూడు రౌండ్లుకు గాను ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ 12 గంటలకు వరకూ మొదటి రౌండ్లో చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు 2వేల 4వందల 26 ఓట్లు ఆధిక్యం లో ఉండగా రెండో రౌండ్లో 6,702 ఓట్లు ఆధిక్యంలో ఉన్నారు మూడవ రౌండు పూర్తి పూర్తి అయ్యేసరికి 7వేల 8 వందల 40ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు.ఇదిఇలా ఉండగా మొత్తం 32 వార్డుల్లో జనసేన 12, టిడిపి 14, బిజెపి ఒక వార్డు మొత్తం 27 వార్డులో కూటమి తరపున ఆయా వార్డులో ఘనవిజయం సాధించారు. కాగా వైకాపా కేవలం 5 వార్డలకే పరిమితమైంది.ఇదిఇలాఉండగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల సొంత వార్డుల్లో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు విజయం సాధించడం ఆసక్తికరంగా మారింది. కూటమి టీడీపీ చైర్మన్ అభ్యర్థి వార్డులో వైసీపీ, వైసీపీ చైర్మన్ అభ్యర్థి వార్డులో టీడీపీ అభ్యర్థి గెలుపొందడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

"నాయుడుపేటలో బీజేపీ విజయదుందుభి

- సన్నారెడ్డి దయాకర్ రెడ్డి నాయకత్వానికి ఘనత..!"
- "అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా శ్రమించిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డి... నాయుడుపేటలో కమల వికాసం..!"
- "విజయ వ్యూహం... నాయకత్వ పటిమ... నాయుడుపేటలో బీజేపీ గెలుపు బాటలో సన్నారెడ్డి దయాకర్ రెడ్డి...!"
- నాయుడుపేటలో బీజేపీ ఘన విజయం... సన్నారెడ్డి దయాకర్ రెడ్డి నాయకత్వానికి ప్రజల పట్టం...!
- మున్సిపల్ ఎన్నికల్లో కమల వికాసం... అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సాగిన కృషికి ప్రజల నీరాజనం...!

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట

నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలో గట్టి పోటీని ప్రదర్శించి విజయాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలను నేరుగా కలుసుకుని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అహర్నిశలు కృషి

సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు.

నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికల వ్యూహాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. బీజేపీ అభ్యర్థుల విజయానికి ఆయన అందించిన మార్గదర్శకత్వం, పార్టీ శ్రేణుల సమష్టి కృషి తోడ్పడ్డాయని నాయకులు పేర్కొన్నారు.

యథావిధిగా పోలింగ్.. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోండి

- కొవ్వూరు ఆర్డీఓ ఆనందరావు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తాళ్లపూడి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఈ నెల 5వ తేదీ గురువారం యథావిధిగా జరగనున్నా యని, ఓటర్లంతా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కొవ్వూరు ఆర్డీఓ ఆనందరావు కోరారు. ఎన్నికల నిర్వహణకు సంబం ధించి వేగేశ్వరపురం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పో లింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆర్వో, ఎంపీడీఓలతో మాట్లాడి ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ సామగ్రిని పూర్తి స్థాయిలో తనిఖీ చేసుకోవాలని, సందేహాలుంటే జోనల్ అధికారులు, ఆర్వో, ఎంపీడీఓ, తహసీల్దార్తో పాటు ఉన్నతాధికారుల సూచనలు తీసుకోవాలని పోలింగ్ సిబ్బందికి ఆర్డీఓ సూచించారు. వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ సామగ్రిని త్వరితగతిన కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు గాను తాడిపూడి ఏకగ్రీవం కావడంతో మిగిలిన 14 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆర్వో జయ రామలక్ష్మి తెలిపారు. మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 389 మంది పోలింగ్ సిబ్బందిని రెండు జోన్లు, ఎనిమిది రూట్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. 100 మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండటంతో పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించడంలో సిబ్బంది కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సీఎం సహాయ నిధికి కోటి విరాళం ఇచ్చిన విట్ సంస్థ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి



ముఖ్యమంత్రి సహాయ నిధికి అమరావతిలోని వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూ. 1 కోటి విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ చైర్మన్ జి.విశ్వనాథన్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళాన్ని అందజేశారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో ఏపీ తీవ్రంగా నష్ట పోయిందని... తుఫాను బాధితులకు సహకారం అందించేలా వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విరాళాన్ని అందిస్తున్నట్టు వివరించారు. విరాళం ఇచ్చిన విట్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు అభినందించారు.

రామచంద్రాపురంలో కూటమి ఘన విజయం

- పోటి చేసిన 12 చోట్ల క్లీన్ స్వీప్ చేసిన జనసేన
- 14 చోట్ల టిడిపి,5 చోట్ల వైకాపా అభ్యర్థులు గెలుపు.
- వైకాపా 5 చోట్ల కే పరిమితం
- పత్తాలేని స్వతంత్ర అభ్యర్థులు.

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం



రామచంద్రాపురం మున్సిపాలిటీకి మంగళవారం నిర్వహించిన కౌంటింగ్లో టిడిపి మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు పట్టణంలో 32 వార్డులకు వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన 12 వార్డులో అభ్యర్థులందరూ బారీ విజయం సాధించడంతో జనసేన క్లీన్ స్వీప్ చేసింది. అలాగే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు 14 మంది ,వైకాపా అభ్యర్థులు ఐదుచోట్ల విజయం సాధించారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ తరపున 19 మంది పోటీ చేయగా వీరిలో తెలుగుదేశం అభ్యర్థులపై 5 గురు వైకాపా అభ్యర్థులు విజయం సాధించారు.దీంతో 14 మంది టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఆరు చోట్ల పోటి చేసిన స్వతంత్ర అభ్యర్థులు ఎక్కడా పోటి ఇవ్వలేకపోయారు. మొత్తం మూడు రౌండ్లుకు గాను ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ 12 గంటలకు వరకూ మొదటి రౌండ్లో చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు 2వేల 4వందల 26 ఓట్లు ఆధిక్యం లో ఉండగా రెండో రౌండ్లో 6,702 ఓట్లు ఆధిక్యంలో ఉన్నారు మూడవ రౌండు పూర్తి పూర్తి అయ్యేసరికి ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. రామచంద్రపురం పురపాలక సంఘ మునిసిపల్ ఎలక్షన్స్ కు మంగళవారం జరిగిన కౌంటింగ్ ప్రక్రియలో మొత్తం 32 వార్డులకు ఫలితాలు విడుదల చేశారు ఇప్పటి వరకు ప్రకటించిన పలితాలలో 1వ వార్డు అభ్యర్థిగా మేడిశెట్టి దుర్గ ప్రసాద్, (టిడిపి) 215 ఓట్లు, 2వ వార్డు అభ్యర్థి పైడిమల్ల సత్తిబాబు, (టిడిపి) 72 ఓట్లు, 3వ వార్డు అభ్యర్థి అంకం శ్రీనివాస్ (జనసేన) 309 ఓట్లు, 4వ వార్డు అభ్యర్థి సుంకర రమ్య, (జనసేన) 392 ఓట్లు, 5వ వార్డు అభ్యర్థి గొర్రెల గణపతి (జనసేన) 343 ఓట్లు, 6వ వార్డు అభ్యర్థిచోడే భాను భాస్కర రావు (వైకాపా) 62 ఓట్లు ,7వ వార్డు అభ్యర్థి రాయుడు మణికంట, (బిజెపి) 03 ఓట్లు, 8వ వార్డు అభ్యర్థి సలగల వెంకటేష్, (జనసేన) 254 ఓట్లు, 9వ వార్డు అభ్యర్థి చిక్కం రామ శ్రీనివాస్ , (జనసేన) 280 ఓట్లు, 10వ వార్డు అభ్యర్థి టేకుముడి రామకృష్ణ, (టిడిపి) 169 ఓట్లు, 11వ వార్డు అభ్యర్థి కేతా సుజాత, (టిడిపి) 239 ఓట్లు, 12వ వార్డు అభ్యర్థి కాకర్లపూడి వెంకట పద్మా వతి, (టిడిపి) 202 ఓట్లు, 13వ వార్డు అభ్యర్థి కిల్లి లలిత, (టిడిపి)342 ఓట్లు , 14వ వార్డు అభ్యర్థి లంక శ్రీను, (టిడిపి),605, ఓట్లు, 15వ వార్డు అభ్యర్థి మట్టా సత్యవేణి(జనసేన),430 ఓట్లు, 16వ వార్డు అభ్యర్థి లంకా వెంకట దుర్గ, (జనసేన),345 ఓట్లు ,17వ వార్డు అభ్యర్థి కొట్టు భులక్ష్మి (జనసేన),381ఓట్లు, 18వ వార్డు అభ్యర్థి చప్పిడి ఉమాదేవి, (జనసేన)522 ఓట్లు,19వ వార్డు అభ్యర్థి ములగపాటి వెంకట సుబ్బరాజు, (టిడిపి)370 ఓట్లు,20వ వార్డు అభ్యర్థి గుండుబోగుల రమేష్, (జనసేన)742 ఓట్లు, 21వ వార్డు అభ్యర్థి మల్లిడి సాయి లక్ష్మి, (వైకాపా)82 ఓట్లు, 22వ వార్డు అభ్యర్థి జాస్తి విజయ లక్ష్మి, (టిడిపి) 268 ఓట్లు, 23వ వార్డు అభ్యర్థి వైట్ల సూర్య ప్రకాశ్, (టిడిపి)568 ఓట్లు ,24వ వార్డు అభ్యర్థిగా పిట్ట వెంకట నారాయణ రావు, (వైకాపా)33 ఓట్లు25, వ వార్డు అభ్యర్థి సత్యవాణి విజయలక్ష్మి,(జనసేన)451ఓట్లు,26 వ వార్డు అభ్యర్థి చల్లా మంగా దేవి,(జనసేన)296 ఓట్లు 27 వ వార్డు అభ్యర్థి గొల్లా అపర్ణ (టిడిపి)227 ఓట్లు,28 వార్డు అభ్యర్థి దంగేటి పద్మావతి (టిడిపి) 29 వ వార్డు అభ్యర్థి అంగర జయలక్ష్మి (టిడిపి)30 వ వార్డు అభ్యర్థి కుడుపూడి భీమన్న (వైకాపా) 153 ఓట్లు, 31వ వార్డు అభ్యర్థి సూరంపూడి గణేష్ (వైకాపా) 19 ఓట్లు,32 వ వార్డు అభ్యర్థి దొమ్మలపాటి మీనా ప్రియాంక (టిడిపి) 61 ఓట్లు మెజార్టీ తో ఆయా చోట్ల విజయం సాధించారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు - ప్రతి కేంద్రం వద్ద పోలీసు భద్రత ఏర్పాటు



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో గురువారం జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ప్రత్యేక అధికారి ఈ.బి. విలియమ్స్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, ఇతర పరికరాలను మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే తరలించినట్లు వెల్లడించారు. పోలింగ్ విధులకు నియమించిన సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకుని ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేశామని, పటిష్ఠ బందోబస్తు మధ్య ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఈ.బి. విలియమ్స్ తెలిపారు.

తప్పక తమ ఓటుహక్కును వినియోగించుకోండిలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

నేడు జరిగే ఎంపిటిసి,జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రతి ఓటరూ తప్పక తమ ఓటుహక్కు ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ అనగా 05.11.2026 గురువారం ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని, జిల్లాలోని 20 మండలాల్లో 20 జడ్పీటీసీ స్థానాలకు, 395 ఎంపిటిసి స్థానాలకు మొత్తం 1,317 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జడ్పీటీసీ స్థానాలకు 80 మంది, ఎంపిటిసి స్థానాలకు 933 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, మొత్తం 11,68,848 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారని తెలిపారు. జిల్లా ప్రజలందరూ రాజ్యాంగం అందచేసిన అమూల్యమైన హక్కుని వినియోగించుకోవడం వల్ల మీ గ్రామ, మీ ప్రాంత అభివృద్ధికి పునాది వేసిన వాళ్ళవుతారని...కాబట్టి ప్రతి ఓటరు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో 01.11.2026న జరిగిన పురపాలక ఎన్నికల్లో జిల్లాలో 70.83 శాతం పోలింగ్ నమోదైందని గుర్తుచేస్తూ, గ్రామీణ ఓటర్లు అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఓటు వేసి కాకినాడ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. ఓటు వేయడానికి వచ్చేటప్పుడు ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదించిన 20 ఫోటో గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రెండు చోట్ల పోలింగ్ కేంద్రాలు మార్పు చేయడం జరిగిందని, సామర్లకోట, కిర్లంపూడి మండలాల్లో ఈ మార్పులు చేయడం జరిగిందన్నారు. సామర్లకోట మండలంలో మాధవపట్నం పోలింగ్ కేంద్రాలు 42, 43, 44 లను పంచాయతీ ఆఫీస్ మరియు మహిళా మండలి కేంద్రానికి మార్చడం చేయడం జరిగిందని, అదేవిధంగా కిర్లంపూడి మండలం జగపతి నగరంకు సంబంధించిన 40 మరియు 43వ పోలింగ్ కేంద్రాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు పోలింగ్ కేంద్రాలు పరిధిలో ఉన్న ప్రజలు మార్పును గుర్తించి కొత్త పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుసుకోవాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్ష పాతంగా, ప్రశాంత వాతావరణం లో జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సమస్యాత్మక,అతి సమస్యాత్మకమైన 670 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా, మిగిలిన 647 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపుల సౌకర్యాలు కల్పించామని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సహాయం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వచ్చి ఓటు వేయాలని, సాయంత్రం 5.00 గంటలకు క్యూలో ఉన్న ప్రతి ఓటరుకూ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. "మీ ఓటు – మీ గ్రామ భవిష్యత్తు అని తప్పక ప్రతి ఓటరు తమ ఓటుహక్కు ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి 95 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయం

- నారా లోకేష్‌ని కలిసి అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి 95 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుతమైన విజయాన్ని సాధించడం పట్ల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వహక అధ్యక్షులు నారా లోకేష్ ని కలిసి ఘన విజయంపై శు భాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ విజయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజలు అందించిన మద్దతుకు నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకుల సమష్టి కృషి, కార్యకర్తల అహర్నిశల శ్రమ ఈ ఘన విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రజలు మరోసారి పట్టం కట్టారని అన్నారు. ఈ విజయానికి సహకరించిన కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం మరింత కట్టుబాటుతో పనిచేస్తుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ప్రజాభూమి

జనరల్ 14

గురువారం 5 నవంబర్ 2026

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- భారీ వర్షంలోనూ అధికారులు, సిబ్బంది నిర్విరామ కృషి ప్రశంసనీయం
- ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి,భీమవరం



ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ ఁ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇఎ డిసిఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ పనుల పర్యవేక్షణా బాధ్యతలను ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటికి అప్పగించారు. ఈ సందర్భంగా సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేసే అంశంపై విద్యుత్ శాఖ అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేశామని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలి కారణంగా 33కెవి సబ్- స్టేషన్లు-98, 33కెవి ఫీడర్లు- 67, విద్యుత్ స్తంభాలు-8,859 11కెవి ఫీడర్లు-475, 516 ట్రాన్స్ ఫార్మర్లు, 755 కి. మీ. మేరకు విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో జిల్లాలోని 6 పట్టణాలు, 20 మండలాల్లోని 409 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులకు వీలైనంత తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను అందించాలనే ధ్యేయంతో భారీ వర్షాన్ని, బలమైన గాలిని సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టడంతో త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రానికి 6 పట్టణాలు, 409 గ్రామాలకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇక జిల్లాలో 17 వేల అక్వా సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడగా 14వేల సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. మిగిలిన అక్వా సర్వీసులతోపాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరఫరాను పునరుద్ధరించేందుకు గత వారం రోజులుగా భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్విరామంగా కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడైడా గృహ విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరా లేనట్లయితే సరఫరా పునరుద్ధరణ కోసం వినియోగదారులు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబరు: 9490610152కు కాల్ చేయవచ్చని తెలియజేశారు. వెంటనే సరఫరా పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఈ నెల 18 లోపు ఎన్నికైన మేయర్లు, చైర్‌పర్సన్లు, వార్డు సభ్యులకు ఎన్నికల నోటీసు జారీ

- నవంబర్ 23 వ తేదీన డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ల పరోక్ష ఎన్నికల నిర్వహణ
- పరోక్ష ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా 87 మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేయనున్నారని, అనంతరం 23వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్‌పర్సన్‌లు, మేయర్ లు ఎన్నికైన ఒక వార్డు సభ్యున్ని డిప్యూటీ మేయర్ గా, వైస్ చైర్‌పర్సన్ గా ఎన్నుకోనున్నారని ఎన్నికల కమిషనర్ పునేఠా తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా నిర్దిష్ట తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేసి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ఎన్నికల అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలు, చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నికల కమిషనర్ పునేఠా సూచించారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు:

మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు: 87, మున్సిపల్ కార్పొరేషన్లు: 13, ఎన్నికల నోటీసు జారీ: 18.11.2026 లోపు పరోక్ష ఎన్నికల నిర్వహణ: 23.11.2026. ఏదైనా అనివార్య కారణాల వల్ల నవంబర్ 23 వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించకపోతే ఆ ఎన్నికల ప్రక్రియను నవంబర్ 24 తేదీన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ షెడ్యూల్ కీలకంగా మారనుందని ఈ ఎన్నికలతో పట్టణ స్థానిక సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ మరింత ముందుకు సాగనుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు.

సీఎం చంద్రబాబుతో మేజర్ జనరల్ జి.శ్రీనివాస్ భేటి



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

తెలంగాణా- ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. సచివాలయంలో ముఖ్యమంత్రితో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి స్థానిక మిలటరీ లోకల్ అథారిటీగా వివిధ అంశాలను ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సైనిక దళాలకు పూర్తిస్థాయిలో సహకారం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

కుండపోతగా వర్షం రోడ్లు జలమయం







- నియోజకవర్గంలో ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు ఇక్కట్లు.
- మోటార్లతో వర్షపు నీరు తొలగింపు.
- చెరువులను తలపిస్తున్న కోర్టుల ప్రాంగణం.
- రైతులకు తీరని అపార నష్టం

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం/కాజులూరు,

రామచంద్రపురం నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో ఎడతెరిపి లేకుండాకురిసిన కుండపోత వర్షంతో ప్రజలు ఇక్కట్లు గురి అయ్యారు. రామచంద్రపురం పట్టణంలో పలుచోట్ల వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. మునిగిపోతున్న పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ప్రధాన వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అకాల వర్షాల ప్రభావంతో గుబ్బలవారి వీధి, రామదుర్గ సెంటర్, మోడ్రన్ వీధి, పిల్లవారి హైస్కూల్ వీధి, అంకంవారి వీధి, ప్రధాన కోర్టు ప్రాంతం, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయో మంగళవారం కురిసిన వర్షాలకు మున్సిపల్ కౌంటింగ్ జరిగిన చింతపల్లి సూరన్న నగర్ లో గల మున్సిపల్ హైస్కూల్ నందు మోకాళ్ళ లోతు నీరు నిలిచిపోవడంతో కౌంటింగ్ ప్రక్రియకు హాజరైన నేతలు అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం భోజనాలు చేయడానికి కూడా అవకాశం లేనట్లుగా రూములోకి సైతం నీరు రావడంతో అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేయాలి. గుంతలమయమైన, పల్లపు ప్రాంతాల్లోని రహదారులను ఎత్తు పెంచి నూతనంగా నిర్మించాలి వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలి ముంపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. పట్టణంలో ముఖ్య ప్రాంతమైన కోర్టులు ప్రాంగణంలో కూడా కుడపోతవర్షంతో జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. అలాగే కాజులూరు మండలం గొల్లపాలెంలో కాకినాడ- కోటిపల్లి ప్రధాన రహదారి, యానం ద్రాక్షారామ ప్రధాన రహదారిలో కోలంక గ్రామంలో ప్రధాని రహదారిపై మీరు నిల్చుపోవడంతో చెరువులను తలపిస్తూ దర్శనమిస్తున్నాయి. ఇక రైతన్నకైతే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోలుకోను దెబ్బ తగిలింది ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి రైతులకు తగిన న్యాయం చేయాలని రైతన్న కోరుతుంది. ముఖ్యంగా ఎన్నికల సమయం వేళ పోటీలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులకు సైతం వర్షం కారణంగా ప్రచారంలో ఎదురుదెబ్బే తగిలింది. తగిన సమయం లేకపోవడంతో ఆయాచోట్ల అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఎన్నికల సిబ్బంది తమ విధుల్లో చేరడానికి వర్షం ప్రభావంతో అసహనానికి గురయ్యారు. అదేవిధంగా బుధవారం కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయమై చెరువులుగా తలపిస్తున్నాయి. అదేవిధంగా గ్రామాల్లో ఇంకా మారుమూల ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా రాకపోవడంతో పలు గ్రామాల్లో అంధకారంలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా వారం రోజుల్లో రెండు తుఫాను కారణంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రజలు, రైతులు కోలుకొని పరిస్థితి నెలకొంది.

జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ముందస్తు పటిష్ట ఏర్పాట్లు

- పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్ రూములకు తరలించాలి
- కౌంటింగ్‌కు ముందురోజే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ:



నవంబర్ 5వ తేదీన నిర్వహించ నున్న జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్ రూములకుతరలించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఎంపీడిఓలను ఆదేశించారు. బుధవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి ఎంపీడీఓ లతో జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సుల తరలింపు లో ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా పటిష్ట భద్రత నడుమ చర్యలు చేపట్టాలన్నారు.పోలింగ్ అనంతరం పీవో డైరీ,ఇతర ఎన్నికల సంబంధిత పత్రాలను జాగ్రత్తగా భద్రపరిచి, నిర్దేశించిన విధంగా స్ట్రాంగ్ రూములకు తరలించే ప్రక్రియలో ఎంపీడీవోలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా నవంబర్ 7వ తేదీన నిర్వహించ నున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ముందురోజే అవసరమైన కౌంటింగ్ టేబుళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈఓ లక్ష్మణరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ఖచ్చితంగా పాటించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరిన వైఎస్సార్సీపీ

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి

రాష్ట్రంలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, వెబ్ క్యాస్టింగ్, అభ్యర్థులకు, పోలింగ్ కేంద్రాలకు తగిన భద్రత ఏర్పాటు చేయాలని వైఎస్సార్సీపీ ఎన్నికల కమిషన్ ను కోరింది. అలాగే పోలింగ్ వేళ వైఎస్సార్సీపీ నేతల అక్రమ అరెస్టులు, గృహనిర్భంధాలు అడ్డుకోవాలని విజధప్తి చేసింది. దీంతో పాటు మున్సిపల్ ఎన్నికల సీసీటీవీ ఫుటేజ్, బ్యాలెట్ పత్రాల్ని నిబంధనల ప్రకారం భద్రపరచాలని కూడా కోరింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఎస్ఈసీకి వేర్వేరు లేఖలు రాశారు. వీటి కాపీల్ని కేంద్ర ఎన్నికల కమిషన్ కు కూడా పంపారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సుప్రీం ఆదేశాలు పాటించాలి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో అయినా సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్ఈసీని వైఎస్సార్సీపీ అభ్యర్థించింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో, పోలింగ్ ప్రాంగణం లోపల, చుట్టుపక్కల తగిన కవరేజీతో నిరంతర సీసీటీవీ నిఘా లేదా వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కోరింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో, ముఖ్యంగా అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, బ్యాకప్ రికార్డింగ్ సదుపాయాలతో అంతరాయం లేని ప్రత్యక్ష వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని తెలిపింది.

స్థానిక ఎన్నికల్లో కూటమికి పట్టాభిషేకం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి సాధించిన ఘన విజయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి కూటమి విజయంపై అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమానికే ప్రజలు మద్దతు పలికారు. విధ్వంసాలు, కుట్రలతో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల మనసులు గెలవలేరని ఈ తీర్పుతో స్పష్టం చేశారు. కూటమి విజయానికి కృషి చేసిన భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు అభినందనలు. ఎన్నికల ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయి. ఈ తీర్పు తమకు మరింత వినయంతో, మరింత బాధ్యతతో పనిచేయాలనే సంకల్పాన్ని ఇచ్చిందన్నారు.

అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు : ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:



గత 27 నెలల కూటమి ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమైన పట్టం కట్టారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించిన రాష్ట్ర ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక పాదాభివందనాలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ స్థానిక సంస్థల విజయం మామూలు గెలుపు కాదు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతోనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వానికి ప్రజలు 164 స్థానాలతో తిరుగులేని మెజారిటీ ఇచ్చారు. 2024 నాటి ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సాగిన కూటమి సుపరిపాలన ఫలితమే నేటి ఎన్నికల విజయం. ప్రజలు ప్రభుత్వ పనితీరును, సంక్షేమ ఫలాలను గుర్తించి కూటమి వైపే స్పష్టమైన తీర్పునిచ్చారని బొండా ఉమా స్పష్టం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్లు, 83 మున్సిపాలిటీల్లో ప్రజలు ఎంతో స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2021 నాటి వైసీపీ అరాచక పాలనలో జరిగిన స్థానిక ఎన్నికలు రాష్ట్రానికి ఒక పీడకల. ఆనాడు మాచర్లలో సాక్షాత్తు నాపైనే హత్యాయత్నం జరిగిన దృశ్యాలు నేటికీ యూట్యూబ్‌లో చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అటువంటి భయానక పరిస్థితుల నుంచి బయటపడి, నేడు ఎటువంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాం. పులివెందుల, పుంగనూరుల్లో నామినేషన్ల వేళ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి ముఠాలు కార్లు తగలబెట్టి, ఆయుధాలతో దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా, ప్రజలు మాత్రం గొడ్డలి పార్టీ అరాచకాలకు గట్టి సమాధానం చెప్పారు.

ఈవీఎంలైనా.. బ్యాలెట్ అయినా.. ప్రజా తీర్పు కూటమి వైపే

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోగానే 'ఈవీఎంల వల్లే ఓడాం, బ్యాలెట్ పేపర్లు పెట్టండి' అని వైసీపీ గగ్గోలు పెట్టింది. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్లు 2019లో గెలిచినప్పుడు ఈవీఎంలు మంచివి, 2024లో 11 సీట్లకు పరిమితమైనప్పుడు చెడ్డవా? ఇప్పుడు స్థానిక సంస్థల్లో బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగినా ఫలితం మారలేదు. ఈవీఎంలైనా, బ్యాలెట్ పేపర్లయినా ప్రజల తీర్పు స్పష్టంగా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి వైపే ఉందని రుజువైంది. ఇప్పటికైనా వైసీపీ అసత్య, విష ప్రచారాలు మానుకోవాలి. స్థానిక ఎన్నికల్లో కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక ఆ పార్టీ పూర్తిగా ఉనికి కోల్పోయింది. గత 27 నెలల్లోనే ?75,000 కోట్లు కేవలం పెన్షన్ల కోసమే ఖర్చు చేశాం. సామాజిక పెన్షన్‌ను ?3,000 నుంచి 4,000కి, దివ్యాంగులకు ?6,000కి, బెడ్‌రిడెన్ బాధితులకు 10,000కి, తలసేమియా పేషెంట్లకు 15,000కి పెంచి మాట నిలబెట్టుకున్నాం.

ప్రజాభూమి

జనరల్ 15

గురువారం 5 నవంబరు 2026

ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని డ్రైన్లు, కాలువల ద్వారా వెంటనే బయటకు పంపించాలి.

వరద ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

మురసు తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, పలువురు చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.మురసు తుఫాన్ ప్రభావంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని మంత్రి నిమ్మల తెలిపారు. పర్చూరు, బాపట్ల, చీరాల, ప్రత్తిపాడు ప్రాంతాల్లో నల్లమడ, పర్చూరు డ్రైన్లు గరిష్ట నీటిమట్టానికి మించి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని కెనాల్స్, డ్రైన్ల ద్వారా వెంటనే బయటకు పంపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

బుడమేరు, ఎర్రకాలువ, గోనెలవాగు, తమ్మిలేరు, ఏలేరు నదులు, వాగులు, రిజర్వాయర్లకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగుల నుంచి ప్రకాశం బ్యారేజీకి 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని మంత్రి తెలిపారు. బుడమేరు క్యాచ్‌మెంట్ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలోకి తరలిస్తున్నామని వెల్లడించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ పటిష్టమైన ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గత రెండు రోజులుగా విజయవాడలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎనికేపాడు అండర్ టన్నెల్ (యూటీ) నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి తరలిస్తున్నామని తెలిపారు.ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

వ్యయ నివేదికల సమర్పణపై దృష్టిపెట్టండి

- ఎస్ఈసీ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

- ఏఈవోలతో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్ బుధవారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు (ఏఈవో), జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్ అనంతరం సమర్పించాల్సిన ఎన్నికల వ్యయ నివేదికల తయారీ, వివరాల నమోదు, పరిశీలనకు సంబంధించిన అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అభ్యర్థులపై అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్ కేసులు, రిజిస్టర్ల నిర్వహణ, నగదు, మద్యం, ఇతర వస్తువుల స్వాధీనాలు, పెయిడ్ న్యూస్ అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపుల ఖర్చులు, అభ్యర్థుల రోజువారీ వ్యయ రిజిస్టర్లు, రాజకీయ పార్టీల ఖర్చులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ, తమ రికార్డులను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు.ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేసి, సంబంధిత ఆధారాలతో నివేదికలను సిద్ధం చేయాలని, పోలింగ్ పూర్తయిన అనంతరం నిర్దేశిత గడువులోగా సంతకం చేసిన నివేదికలను సమర్పించాలని బి.విజయకుమార్ విజయ కుమార్ స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు ఏడు సూత్రాలు పాటించాలి!

భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడమే లక్ష్యం: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్. రామకృష్ణ





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి వనరులను కాపాడుకుంటూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్. రామకృష్ణ పిలుపునిచ్చారు. భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాలంటే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారం-2026 (ఒక వారం.. ఏడు చర్యలు.. ఒకే గ్రహం) కార్యక్రమంలో భాగంగా బుధవారం వి.ఆర్.పురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రేంజ్ ఆఫీసర్ ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, స్థానికంగా లభించే సహజ ఆహారాన్ని ప్రోత్సహించడం, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌కు దూరంగా ఉండడం, వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం, ఇ-వ్యర్థాల బాధ్యతాయుత నిర్వహణ వంటి ఏడు ప్రధాన సూత్రాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వివరించారు. అనంతరం విద్యార్థినులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులు ఈ ఏడు సూత్రాలను తమ ఇళ్లలో, పాఠశాలల్లో, గ్రామాల్లో పాటించడమే కాకుండా తల్లిదండ్రులకు, గ్రామ ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ చుక్కయ్య మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు, ప్రకృతి వనరుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు కలుషితమవుతున్నాయని, ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులను ఉపయోగించాలని విద్యార్థినులకు వివరించారు. చింతూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సాంకేత్ సునీల్ గరుడ, ఐఎఫ్ఎస్, రాజమండ్రి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ టి. జ్యోతి, ఐఎఫ్ఎస్ సూచనలు, మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

బిఏఎస్ఈ స్కూల్ విద్యార్థి ఎంపిక

అండర్-14 ఆంధ్రప్రదేశ్ జట్టులో గొల్లోరి జగ్బండ్‌కు చోటు.. పాఠశాలకు గర్వకారణం





ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

వేటమామిడి దొరబాబు స్కూల్ విద్యార్థి గొల్లోరి జగ్బండ్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. అండర్-14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన జగ్బండ్ ఈ నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది.ఇప్పటికే బి ఏ ఎస్ ఈస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఫుట్‌బాల్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. అండర్-17 బాలుర విభాగంలో వరుణ్ విన్సెంట్, చెదల విజయ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, అండర్-14 బాలికల విభాగంలో బిర్మో ఎస్తేరు సైతం రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాల ఖ్యాతిని పెంచారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత నిస్తూ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా స్కూల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విద్యార్థు ల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించడం వల్లే ఇటువంటి విజయాలు సాధ్యమవుతున్నాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

ఈ సందర్భంగా విద్యార్థుల విజయానికి కృషి చేసినసుందర్, ప్రిన్సిపల్ మృదుహాసిని, డీన్ ధన సందీప్, డైరెక్టర్ డేనియల్ సందీప్‌లను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో జగ్బండ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసు కురావాలని ఆకాంక్షించారు.ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ ఉందని ఈ విజయం మరోసారి నిరూపించింది. సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే గిరిజన ప్రాంతాల విద్యార్థులు జాతీయ స్థాయిలోనూ రాణించగలరనే సందేశాన్ని జగ్బండ్ విజయం అందిస్తోంది.

పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు బి.ఆర్. అంబేద్కర్

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష.. పోలింగ్ సిబ్బందికి దిశానిర్దేశం





ప్రజాభూమి ప్రతినిధి- రంపచోడవరం

పోలవరం జిల్లాలో నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించే ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ బి.ఆర్. అంబేద్కర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తితో కలిసి సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ సిబ్బంది తరలింపు ఏర్పాట్లను సమీక్షించారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి పంపిణీ విధానం, సిబ్బందికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, రవాణా సదుపాయాలను పరిశీలించిన సాధారణ పరిశీలకులు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి పోలింగ్ బృందానికి కేటాయించిన సామగ్రిని సరిచూసుకుని అందజేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకుని, పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

అనంతరం పోలింగ్ సామగ్రితో తమకు కేటాయించిన కేంద్రాలకు బయలుదేరుతున్న పోలింగ్ సిబ్బందితో మాట్లాడి ఎన్నికల విధుల నిర్వహ ణపై పలు సూచనలు చేశారు. ఎన్నికల సం ఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకుని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చూడాలని తెలిపారు.జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించిన సాధారణ పరిశీలకులు, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తుపాను నష్టంపై ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు

- **విద్యుత్ పునరుద్ధరణ పనులు సాయంత్రంలోగా పూర్తి చేస్తాం**
- **పల్నాడు జిల్లాలో పంట నష్టాల పరిశీలన.. రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా**
- **రెండు వేల మందికిపైగా ఇతర రాష్ట్రాల సిబ్బందితో సహాయక చర్యలు**

ప్రజాభూమి ప్రతినిధి,చిలకలూరిపేట / అద్దంకి

తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ గుర్తించి, నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తొలుత పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట పరిసర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ఆయన పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని రైతులు మంత్రికి వివరించారు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపరిహారం అందకుండా మిగిలిపోకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం అద్దంకిలో పర్యటించిన మంత్రి.. తుపాను ప్రభావం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు జాగ్రత్తలు, సమన్వయంతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని ఎదుర్కోగలిగామని తెలిపారు. తుపానుకు రెండు రోజుల ముందే విద్యుత్ సిబ్బందిని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేశామని చెప్పారు.

మూడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం

తుపాను ప్రభావంతో ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలు గత రెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచి రెండు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని





వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని ప్రకాశం, పల్నాడు జిల్లాలకు పంపినట్లు చెప్పారు. సీఎండీ నుంచి లైన్‌మెన్ వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని వివరించారు. తెగిపడిన విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం సాయంత్రంలోగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే క్రమంలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట అదనపు సిబ్బంది, సామగ్రిని వినియోగించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బాపట్ల జిల్లాలోనూ తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బాపట్ల జిల్లాలో పర్యటించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. కర్ణాటకలోని గుల్బర్గా నుంచి వచ్చి సేవలందిస్తున్న విద్యుత్ సిబ్బందిని కలిసి వారి పనితీరును అభినందించారు. చీరాలలో తమిళనాడు నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. తుపాను వంటి క్లిష్ట పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను విడిచి వచ్చి ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య పాల్గొన్నారు.